ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 25 ఆగస్టు 2025





## నేటినుంచి స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ

సచివాలయాల ద్వారా అందజేతకు ఏర్పాట్లు

- జిల్లాకు 5.17 లక్షల కార్డులు రాక



విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన స్మార్ట్ రైస్‌కార్డులను సోమవారం నుంచి పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేసింది. ప్రతి నియోజకవర్గంలో ఒకచోట స్థానిక ఎమ్మెల్యేలతో కార్డులు పంపిణీ చేస్తారు. జిల్లాలో 5.24 లక్షల కార్డులుండగా ఇంత వరకు 5,17,149 మంది కార్డులు వచ్చాయి. మిగిలిన కార్డులకు సంబంధించి ఈకేవైసీ ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వాటిని సరిచేసిన తరువాత చేరుతాయి.

జిల్లాకు చేరిన 5.17 లక్షల కార్డులను 642 రేషన్ డిపోలకు అందజేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ ఆదివారం సర్కిల్-2లో కార్డులతో ఉన్న బాక్సులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కాగా ప్రతి రేషన్ డీలరు ఈ- పౌరసరఫరాలు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని డిపో నంబరు, డీలరు ఐడీ నమోదుచేశారు. డిపోలకు చేరిన కార్డులతో ఉన్న బాక్సులపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి ఆ వివరాలను యాప్‌లో నమోదు చేశారు. కార్డులను సోమవారం ఆయా డిపోల పరిధిలో గ్రామ/వార్డు సచివాలయాలకు అందజేయాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో కార్డుదారులకు స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేస్తారు. ప్రతికార్డుదారుని వివరాలను ఈ పోస్ ద్వారా ధ్రువీకరించుకున్న తరువాతే కార్డులు ఇవ్వనున్నారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి కార్డులు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్డుల పంపిణీ వివరాలను ఉన్నతాధికారుల ద్వారా డాష్‌బోర్డుకు అప్‌లోడ్ చేయాలి. వచ్చేనెల 15వ తేదీ వరకు కార్డుల పంపిణీకి అవకాశం ఇచ్చారు. అందువల్ల కార్డుదారులు తమ పరిధిలోని సచివాలయాలకు వెళ్లి కార్డులు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కర్ తెలిపారు.



పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో స్మార్ట్ కార్డుల బాక్సులను పరిశీలిస్తున్న డీఎస్‌వో

## జీవీఎంసీలో ఇక 10 జోన్లు



పరిపాలనా సౌలభ్యం కోసం నియోజకవర్గాల వారీగా విభజన

- భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో రెండేసి ఏర్పాటు
- పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనకు కౌన్సిల్ ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరుతూ లేఖ
- త్వరలో విడుదల కానున్న ఉత్తర్వులు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో జోన్‌లను పునర్వ్యవస్థీకరించాలని అధికారులు నిర్ణయించారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఇప్పుడున్న ఎనిమిది జోన్‌లను పది జోన్‌లుగా విభజించారు. నాలుగునెలు కిందట అధికారులు సిద్ధం చేసిన ప్రతిపాదనలకు జీవీఎంసీ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతిరాగానే కొత్త జోన్‌లు అందబాటులోకి రానున్నాయి.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్నాయి. విశాఖ మునిసిపల్ కార్పొరేషన్‌గా ఉన్నపుడు ఆరు జోన్‌లు ఉండగా, భీమిలి, అనకాపల్లి మునిసిపాలిటీల విలీనం తర్వాత గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)గా మారడంతో వీటి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. కాగా ప్రస్తుతం రెండు, మూడు నియోజకవర్గాల్లో ఒక జోన్ పరిధి విస్తరించి ఉంది. తూర్పు నియోజకవర్గంలో ఉన్న తొమ్మిది, పది, 11, 12, 13 వార్డులు జోన్-2 (మధురవాడ)జోన్‌లో ఉన్నాయి. భీమిలి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, 98 వార్డులు జోన్-2లో ఉన్నాయి. ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఉన్న 14, 24, 25, 26 వార్డులు జోన్-3 (ఆశీల్‌మెట్ట)లో ఉన్నాయి. ఇలా ఒక వార్డు నియోజకవర్గం పరిధి ఒకటైతే, జోన్ పరిధి మరొకటిగా ఉంది. దీనివల్ల ఆయా వార్డులకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయాలనుకుంటే రెండు, మూడు నియోజకవర్గాల ఎమ్మెల్యేలతోపాటు రెండు, మూడు జోన్‌ల అధికారులను పిలవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీనివల్ల ఏఒక్కరైనా ఏదైనా కారణంలో ఆ సమావేశానికి హాజరుకాలేకపోతే కొన్ని సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

### నియోజకవర్గ పరిధిలోకి...

దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి నియోజకవర్గం పరిధిలోని వార్డులు ఆ జోన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. ఇకపై జోన్‌లకు ఒకటి, రెండు అని నంబర్లు

... మిగతా 6వ పేజీలో

**కొత్తగా ఏర్పాటయ్యే జోన్లలోకి వచ్చేవార్డులు**

| | |
|---|---|
| భీమిలి జోన్-1: | ఒకటి, రెండు, మూడు, నాలుగు |
| భీమిలి జోన్-2: | ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది, 98 |
| తూర్పుజోన్: | 9,10,11,12,13,14,15,16, 17,18,19,20.21,22,23,28 |
| ఉత్తర జోన్: | 14,24,25,26,42,43,44, 45, 46,47,48,49,50,51,53,34,55 |
| దక్షిణ జోన్: | 27,29,30,31,32,33,34, 35, 36,37,38,39,41 |
| పశ్చిమజోన్: | 40,52,56,57,58,59,60, 61,62,63,89,90,91,92 |
| పెందుర్తిజోన్-1: | 88,93,94,95,96,97 |
| గాజువాక జోన్: | 64,65,66,67,68,69,70, 71,72,73,74,75,76,86,87 |
| పెందుర్తిజోన్-2: | 77,78,79,85 |
| అనకాపల్లిజోన్: | 80,81,82,83,84 |

## టీడీపీ పార్లమెంటు కమిటీపై కసరత్తు

- అధ్యక్ష రేసులో వేపాడ, సుధాకర్, నజీర్, ప్రణవ్‌గోపాల్, రాజబాబు
- పార్టీ జిల్లా కార్యాలయంలో రేపు సమావేశం
- అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం: గండి బాబ్జీ

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

సంస్థాగత ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం దృష్టిసారించింది. కొత్తవారితో అన్ని కమిటీలను ఏర్పాటుచేయాలని అధినేత చంద్రబాబునాయుడు యోచిస్తున్నారు. దీనికి అనుగుణంగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా నాయకులు, కేడర్‌తో భేటీ నిర్వహించి అందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీలు వేశారు.

విశాఖ పార్లమెంటు నియోజకవర్గ సమావేశం ఈనెల 26న జరగనున్నది. మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, కూడిపూడి సత్తిబాబులతో కూడిన కమిటీ సమావేశానికి హాజరుకానుంది. విశాఖ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి, అధినేతకు నివేదిక ఇస్తారు. పార్లమెంటు కమిటీకీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎవరు ఉండాలన్నది అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయిస్తారు. ప్రస్తుతం విశాఖ పార్లమెంటు అధ్యక్షుడిగా గండి బాబ్జీ, ప్రధాన కార్యదర్శిగా పొలమరశెట్టి శ్రీనివాసరావు కొనసాగుతున్నారు. నగరంలో కొందరు ఎమ్మెల్యేలు గండి బాబ్జీని మార్చాలని గట్టిగా పట్టుబడుతున్నారు. బాబ్జీకి ఎంపీ శ్రీభరత్ సన్నిహితుడిగా పేరుంది. అతని స్థానంలో కొత్త వ్యక్తికి పార్లమెంటు పగ్గాలు అప్పటించాలని అధినేత చంద్రబాబు, గాజువాక ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుపై నేతలు ఒత్తిడి తీసుకువస్తున్నారు. బాబ్జీ స్థానంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావును తెరపైకి తీసుకువచ్చారు. అతనికి పదవి ఇస్తే కాపు సామాజికవర్గానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుందని చెబుతున్నారు. అయితే దక్షిణ ఇన్‌చార్జి, ఎన్టీఆర్ వైద్య ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్ అధ్యక్ష రేసులో ఉన్నారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి రాష్ట్రంలో ఏ జిల్లా అధ్యక్ష పదవీ ఇవ్వలేదని ఇప్పటికే అధిష్ఠానం దృష్టిలో పెట్టారు. నగరంలోని ఎంపీ, ఎమ్మెల్యేలను కూడా కలిశారు. తాజాగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పేరు తెరపైకి వచ్చింది. నగరానికి చెందిన కొందరు నేతలు ప్రణవ్‌పేరు అధిష్ఠానానికి సూచించినట్టు ప్రచారం జరుగుతోంది. ఇంకా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్, భీమిలికి చెందిన కోరాడ రాజబాబు రేసులో ఉన్నారు. కాగా బాబ్జీ కూడా పార్టీ అధినేతను కలిశారు. అతని నిర్ణయం మేరకు నడుచుకుంటానని చెప్పినట్టు తెలిసింది. అధ్యక్ష పదవిలో కొనసాగాలని అధినేత నిర్ణయిస్తే శిరసా వహిస్తానని స్పష్టం చేసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఎదుట నేతలు, కేడర్ తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.

## ఉక్కు బీఎఫ్ 2, 3 విభాగాల్లో నిలిచిన ఉత్పత్తి

ముడి సరకు కొరతే కారణం





ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ (బీఎఫ్) 2, 3 విభాగాల్లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఉత్పత్తికి అవసరమైన ముడి సరకు లేకపోవడంతో ప్లాంట్‌లో ఉన్న మూడు ఫర్నేస్‌లలో ఒకదానిలో మాత్రమే ఉత్పత్తిని కొనసాగిస్తూ.. మిగిలిన రెండు ఫర్నేస్‌లను డౌన్ చేశారు. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు బీఎఫ్ 2 (కృష్ణ), బీఎఫ్- 3 (అన్నపూర్ణ) విభాగాల్లో ఉత్పత్తి జరగలేదు. బీఎఫ్ -1 (గోదావరి)లో కేవలం 5,198 మెట్రిక్ టన్నుల హాట్‌మెటల్ ఉత్పత్తి జరిగింది. ఆదివారం రాత్రి వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

కొంతకాలం కిందటి వరకు ప్లాంట్ 1, 2 విభాగాల్లో ఉత్పత్తి జరిగేది. ఇటీవల మూడో ఫర్నేస్‌ను ప్రారంభించారు. దీనివల్ల ప్లాంట్‌లో ఉత్పత్తి పెరుగుతుందని, తద్వారా ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కుతుందని భావించారు. కొద్దిరోజులపాటు ఉత్పత్తి ఆశాజనకంగానే జరిగింది. కాలక్రమేణా తగ్గుతూ వచ్చింది. శనివారం నుంచి రెండు ఫర్నేస్‌లలో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోవడంతో ఈ ప్రభావం ప్లాంట్‌లోని మిగతా విభాగాలపై పడింది. ఫలితంగా వాటిల్లో కూడా ఉత్పత్తి తగ్గిపోయింది. హాట్‌మెటల్ హీట్ (పెద్ద సైజు కలిగిన ఇనుప కడ్డీలు) తయారయ్యే ఎస్‌ఎంఎస్ (స్టీల్ మెల్ట్‌షాప్)లో శనివారం ఉదయం ఆరు గంటల నుంచి ఆదివారం ఉదయం ఆరుగంటల వరకు కేవలం 45 హీట్లు మాత్రమే ఉత్పత్తి జరిగింది. ఈ నేపథ్యంలో ప్లాంట్‌కు రా మెటీరియల్ కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మిక నాయకులు కోరుతున్నారు.

## ఎం ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలెన్నడో?

- రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 700 మంది విద్యార్థుల ఎదురుచూపులు
- అనేక కాలేజీలకు అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్లిన యాజమాన్యాలు

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర వ్యాప్తంగా ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియలో జాప్యం నెలకొంది. ఇందుకోసం సుమారు 700 మంది విద్యార్థులు ఎదురు చూస్తున్నారు. ప్రవేశాల కోసం రాష్ట్ర స్థాయిలో ఏపీపీజీఈసెట్, జాతీయ స్థాయిలో జీపాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ యాటిట్యూడ్ టెస్ట్) నిర్వహించారు. రెండు నెలల కిందట ఫలితాలు వెలువరించిన అధికారులు అడ్మిషన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ఆగస్టు ఒకటో తేదీ నాటికి సీట్లను కేటాయించి, ఆగస్టు 11 నుంచి తరగతులు ప్రారంభించాలి. కొన్ని కారణాలతో షెడ్యూల్‌ను వాయిదా వేశారు.

రాష్ట్రంలోని కొన్ని కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ అనుమతులు ఇవ్వలేదు. దీనిపై యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలోనే తొలుత విడుదల చేసిన షెడ్యూల్ వాయిదా వేశారని చెబుతున్నారు. కారణాలు ఏవైనా వందలాది మంది



విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడంలేదు. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నారు. ఈ ఏడాది ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఏపీపీజీఈసెట్‌ను ఉన్నత విద్యా మండలికి ఏయూకు అప్పగించింది. ఈ ప్రక్రియ ఆలస్యం కావడంతో ఎంతో మంది విద్యార్థులు ఏయూ అధికారులను సంప్రదిస్తున్నారు. అయితే, ఫార్మసీ కౌన్సిల్ నుంచి తమకు సమాచారం రాలేదని, ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నామని ఏయూ అధికారులు చెబుతున్నారు. ఫార్మసీ కౌన్సిల్, కాలేజీలకు మధ్య తగాదా తేలనంత వరకు ప్రక్రియ ముందుకు వెళ్లదని మరికొందరు చెబుతున్నారు. ఇదిలా ఉంటే అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యమవుతుండడంతో ఎంఫార్మసీలో చేరేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తున్నారు. ఎంట్రన్స్ రాసిన కొద్దిమంది విద్యార్థులను ఇప్పుడు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీనివల్ల అడ్మిషన్లు పూర్తిగా పడిపోయే ప్రమాదం ఉందని కాలేజీ యాజమాన్య ప్రతినిధులు పేర్కొంటున్నారు.

## స్పీడ్ పెంచిన షీటీమ్స్

- పదిరోజుల్లో 76 హోటళ్లలో తనిఖీలు
- 50 హోటళ్లకు జరిమానా



హోటల్‌లో తనిఖీ చేస్తున్న షీటీవ్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

హోటళ్లలో నాణ్యతలేని, నిల్వ ఆహారం విక్రయాలకు అడ్డుకట్టవేసేందుకు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ 'ఈట్‌రైట్ క్యాంపెయిన్' పేరుతో ఏర్పాటు చేసిన శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (షీ)టీమ్స్ దూకుడు పెంచాయి. నగరంలోని హోటళ్లలో ఆహారకల్తీ, నాణ్యతలేని ఆహారం విక్రయం, నిల్వ ఆహార పదార్థాలను వేడిచేసి విక్రయించడం సాధారణమైపోయింది. వీటిని తినడంవల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఆహార నియంత్రణ మండలి అధికారులు హోటళ్లపై దాడులు చేసినా చర్యలు కనిపించడం లేదు. దీనిపై ఇటీవల ఫిర్యాదులు పెరగడంతో జీవీఎంసీ కమిషనర్ షీటీమ్స్‌కు రూపకల్పన చేశారు. జీవీఎంసీ ఎనిమిది జోన్లలో ప్రజారోగ్యం విభాగంలోని ముగ్గురు ఉద్యోగులతో 16 టీమ్‌లను ఏర్పాటుచేశారు. ఆయా బృందాలు జోన్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్‌లను నిరంతరం తనిఖీ చేసి ఆహారనాణ్యత, వంటగదిశుభ్రత పరిశీలిస్తాయి. కల్తీ జరిగినట్టు, నిల్వ ఆహారం విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే కేసులు నమోదుచేసి, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తున్నారు. గత పదిరోజుల్లో 76 హోటళ్లలో తనిఖీలు చేసి, 71 హోటళ్లకు నోటీసులు ఇవ్వగా 50 హోటళ్ల నుంచి రూ.68,600 జరిమానా వసూలుచేశారు. జోన్-1లో ఎనిమిది చోట్ల తనిఖీలు చేసి మూడు హోటళ్లకు రూ.21 వేలు, రెండో జోన్ పరిధిలో 11 చోట్ల తనిఖీ చేసి పది చోట్ల రూ.పది వేలు, జోన్-3 పరిధిలో 11 చోట్ల తనిఖీలు చేసి, ఐదు చోట్ల రూ.21వేలు, జోన్-4పరిధిలో పదిచోట్ల తనిఖీలు నిర్వహించి రూ11వేలు, జోన్-5 పరిధిలో మూడు చోట్ల రూ.నాలుగు వేలు, జోన్-6 పరిధిలో ఆరు చోట్ల రూ. 7,800, జోన్-7 పరిధిలో మూడు చోట్ల రూ.1,300, జోన్-8 పరిధిలో పది చోట్ల రూ.11వేలు జరిమానా వసూలుచేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపైనా దృష్టి సారించి కేసులు నమోదు చేస్తున్నారు.

## మండపాలు నిరుపయోగం!

ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ ఆశయానికి అధికారుల తూట్లు

- సింహాచలం దేవస్థానం నిధులతో 50 కల్యాణ మండపాల నిర్మాణానికి పాలకమండలి ఆమోదం
- రూ.11.5 కోట్లతో రెండు చోట్ల నిర్మాణం
- ప్రణాళిక లేని పనులతో వృథాగా భవనాలు
- ఇప్పటికీ మారని యంత్రాంగం తీరు



మెయిన్‌రోడ్డులోని శ్రీదేవి సత్రం

సింహాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి):

వివాహాది కార్యక్రమాల నిర్వహణకు తగిన వసతి లేక ఇబ్బందిపడే వారికోసం అన్ని వసతులతో కూడిన సుమారు 50 కల్యాణ మండపాలను నిర్మించాలని సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు తలంచారు. వీటిని దేవస్థానం నిధులతో చేపట్టాలని భావించి తీర్మానాన్ని పాలకమండలి సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనివల్ల ఎంతోమంది అప్పన్న భక్తులకు మేలు జరుగుతుందనే సంకల్పంతో పాలక మండలి ఆమోదించింది. దీంతో హడావుడిగా ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు రెండుచోట్ల రూ.11.5 కోట్ల వ్యయంతో 8 కల్యాణ మండపాలను నిర్మించేశారు. కానీ మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవడంతో ఎందుకూ కొరగాకుండా వృథాగా మిగిలిపోయాయి.



శ్రీనివాసనగర్‌లోని కొత్త కల్యాణమండపం

నగర పరిధిలో కల్యాణ మండపాలు లేక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో దేవస్థానానికి చెందిన ఖాళీ స్థలాల్లో 50 కల్యాణ మండపాలు నిర్మించాలన్నది అశోక్‌గజపతిరాజు ఆలోచన. వాటిని పేద, మధ్యతరగతి వారికి నామమాత్రపు అద్దెకు ఇవ్వాలని భావించారు. ఇందులో భాగంగా

... మిగతా 6వ పేజీలో

## జల వనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

- ఎస్ఈ, సీఈ పోస్టుల్లో ధవళేశ్వరం సర్కిల్ అధికారులు
- ఇక్కడి కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం సమీక్షించడం ఎలా సాధ్యమని ఉద్యోగుల ప్రశ్న
- ఖాళీ పోస్టుల భర్తీకి ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్



విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర రీజియన్ జల వనరుల శాఖలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల నార్త్ కోస్టల్ సీఈగా పదోన్నతి పొందిన రామ్‌గోపాల్ గత నెలలోనే పదవీ విరమణ చేశారు. నార్త్ కోస్టల్ సీఈ పరిధిలో ఐదారు పోస్టులకు గాను ప్రస్తుతం ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎస్ఈలున్నారు. వారిలో విజయనగరం తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు ఎస్ఈ స్వర్ణకుమార్‌కు విశాఖ సర్కిల్, నార్త్ కోస్టల్ సీఈ పోస్టు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో పర్యవేక్షించే మూడు పోస్టుల బాధ్యతలు ధవళేశ్వరం సర్కిల్ ప్రాజెక్టులో పనిచేసే అధికారులకు అప్పగించారు. ధవళేశ్వరం ప్రాజెక్టు సీఈకి నార్త్ కోస్టల్ సీఈ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ధవళేశ్వరంలో పనిచేసే ఇద్దరు ఎస్ఈలలో ఒకరిని విజయనగరంలోని తారకరామ తీర్థసాగర్ ఎస్ఈగా, మరొకరిని విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యత లు అప్పగించారు. బొబ్బిలి సర్కిల్ ఎస్ఈ అప్పారావుకు వంశధార ప్రాజెక్టు ఎస్ఈ బాధ్యతలు అప్పగించారు. వర్షాకాలంలో గోదావరికి వరదలు వస్తుం టాయి. ఆ సమయంలో అక్కడ ఏఈ నుంచి సీఈ వరకూ ప్రతి ఒక్కరిపై ఒత్తిడి ఎక్కువగా

... మిగతా 6వ పేజీలో

# పద్మనాభం జంక్షన్‌లో కాలువ కబ్జా

» ఎంపీడీఓ హెచ్చరించినా.. అక్రమంగా షెడ్ నిర్మాణం
» పంచాయతీ అధికారుల తీరుపై విమర్శలు

పద్మనాభం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాల్లో ఉన్న కాలువలు, గెడ్డలు ఆక్రమణకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. పద్మనాభం జంక్షన్‌లో ఇటీవల మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులు రూ. 6 లక్షలతో కాలువ నిర్మించారు. దీనిపై కొందరు దర్జాగా స్లాబు వేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. మరొకరు ఏకంగా దుకాణం పెట్టి షెడ్ కూడా నిర్మించారు. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన కాలువ ఎవరి ప్రయోజనం కోసం కట్టారో తెలియడం లేదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం ఒకరిద్దరి ప్రయోజనం కోసం లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని పేర్కొంటున్నారు. పంచాయతీలో చాలాచోట్ల డ్రైనేజీలు లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలువలు ఉన్నచోట అవి ఆక్రమణకు గురవుతున్నాయి. గతంలో ఇక్కడ ఉన్న మట్టి కాలువను కప్పి షాపు నిర్మించడంతో కొంతభాగం ఆక్రమణకు గురైంది. ఆ ఆక్రమణ తొలగించకుండానే పంచాయతీరాజ్ శాఖాధికారులు సంబంధిత షాపు యజమానికి ప్రయోజనం చేకూరే విధంగా కాలువ అలైన్‌మెంటు మార్చి నిర్మాణం చేపట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీడీఓ స్వయంగా పరిశీలించి, ఆక్రమణలు తొలగించాలని ఆదేశించినా కింద స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదు.కొందరు స్థానిక నాయకుల అండతో ఆక్రమణలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సత్యవతి వివరణ కోరగా, విషయం తమ దృష్టికి వచ్చిందని, పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


కాలువను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం


స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకుడు

## అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవ లను ఆదివారం వైభవంగా నిర్వహించారు.వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టంపజేశారు. తొలుత నారసింహ సహస్రనామాలు పఠిస్తూ తులసీ దళార్చన చేసి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచారు. నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చకులు పూజలు చేయగా భక్తులు స్వామివారి చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ చేశారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో నిత్య కల్యాణం నిర్వహించారు. అలాగే స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు.

## ఎండాడలో ఆకతాయిలతో ఇబ్బందులు

ఎండాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంతంలో ఆకతాయిల వికృత చేష్టలతో బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఆకతాయిలు వారితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వెంబడిస్తున్నారు. దీంతో పాఠశాలకు వెళ్లేందుకు బాలికలు భయపడుతున్నారు. కొందరు హెచ్‌ఎంకు, ఉపాధ్యాయులకు చెప్పడంతో వారు పోలీసులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అయినా ఆకతాయిల్లో మార్పు రాకపోగా ఉపాధ్యాయులను బెదిరిస్తున్నారు. పాఠశాల సమీపంలో చెట్టు కింద ఉన్న టిఫిన్ సెంటర్ దగ్గర ఉదయం, సాయంత్రం వేళ తిష్ట వేస్తూ విద్యార్థినులను వెంబడిస్తూ అల్లరి చేస్తున్నారు. అలాగే బీసీ కాలనీ ప్రాంతంలో యువత రాత్రి వేళ మద్యం సేవిస్తూ దారిన వచ్చీ పోయే వారిని డబ్బులివ్వాలని వేధిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే తమ వద్ద ఉన్న సీసాలతో గాయపరుస్తున్నారు. గొల్లల ఎండాడకు వెళ్లే రాజీవ్‌నగర్, శాంతినగర్ మార్గంలోనూ ఇదే పరిస్థితి ఉంది. చీకటిపడిన తరువాత మహిళలు ఒంటరిగా అటువైపు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ గస్తీ తిరుగుతున్న పోలీసులు మద్యం సేవించే వారిని మందలిస్తున్నారు తప్ప రహదారులపై గుంపుగా ఉన్న వారిని మందలించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఎండాడ డబుల్ రోడ్డులో స్కైలైన్ వరకు ఆరిలోవ పోలీసుస్టేషన్ పరిధిలోకి రావడం, స్కైలైన్ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న రోడ్డు పీఎంపాలెం స్టేషన్ పరిధిలోకి రావడంతో ఆకతాయిలు తప్పించుకుంటున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరగనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించాలని కోరారు.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.50 వేల విలువైన 10 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కర్ణాటకకు చెందిన రసూల్ (27), షాదీక్ హుస్సేన్‌లు బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తూ దొరికారు.

## జీవీఎంసీలో ఇక 10 జోన్లు

... 5వ పేజీ తరువాయి

కేటాయించకుండా నియోజకవర్గాల పేరుతో జోన్‌లు ఏర్పాటుచేస్తే ప్రజలకు కూడా స్పష్టత ఉంటుందని సూచించారు. దీంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, అదనపు, జోనల్ కమిషనర్లు నాలుగు నెలల కిందట సమావేశమై వార్డు, జోన్‌ల సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా జోన్‌లు ఏర్పాటు చేస్తే ఏ వార్డులు ఎందులో చేరుతాయనే దానిపై ఒక డ్రాఫ్ట్ తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా కావడంతో ఒక వార్డు ప్రజలు జోన్ కార్యాలయానికి రావాలంటే చివరన వుండే వార్డుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని, ఈ నేపథ్యంలో ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లుగా విభజించాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పరిధిలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కోజోన్, భీమిలి, పెందుర్తికి రెండేసి జోన్‌లు ఏర్పాటుకానున్నాయి. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి అనుమతి రాగానే కొత్తజోన్‌ల వ్యవస్థను అమల్లోకి తేనున్నారు.

## భీమిలి బీచ్‌లో సందర్శకుల సందడి


పర్యాటకులతో సందడిగా కనిపిస్తున్న బీచ్

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వాతావరణం చల్లగా ఉండడంతో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులు, పెద్దలు కెరటాల్లో కేరింతలు కొట్టారు. ఇసుక తిన్నెల్లో ఆటలు ఆడుతూ సరదాగా గడిపారు. కాగా బీచ్ రోడ్‌లో వాహనాల పార్కింగ్‌కు సదుపాయం లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అటు బోయవీధి నుంచి ఇటు గెస్ట్‌హౌస్ వరకూ వాహనాలకు ఇష్టానుసారం పార్కింగ్ చేశారు. కొందరు డచ్ సిమెట్రీల వద్ద రహదారి మధ్యలోనే నిలిపివేశారు. దీంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. అధికారులు వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## 88 మందికి హోమియో మందులు పంపిణీ


వైద్య శిబిరంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు, వైద్యులు

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో వైద్యులు 88 మందికి మందులు పంపిణీ చేశారు. చిన్నబజారు డచ్‌రోడ్‌లో వున్న ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో ఈ శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, హోమియో వైద్యులు టి. జగన్నాథరావు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు యువకులను రక్షించిన లైఫ్‌గార్డులు


యువకులతో లైఫ్‌గార్డులు, మెరైన్ పోలీసు కానిస్టేబుల్

సాగర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరు యువకులను లైఫ్‌గార్డులు రక్షించారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన శ్రీజిత్‌గాయెన్ (19), బిటాన్ సర్కార్ (19) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. కొద్దిసేపు బీచ్‌లో విహరించిన తరువాత సముద్ర స్నానాలకు దిగారు. శ్రీజిత్‌గాయెన్, బిటాన్ సర్కార్ పెద్ద అల తాకిడికి గురై సముద్రంలోకి కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డులు గమనించి రక్షించారు.

## నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం


అధికారులకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గాజువాక ప్రాంతానికి చెందిన జి. వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.2,08,000 లను చెక్ రూపంలో ప్రజా సంబంధాల అధికారి వెంకటేశ్వరరావుకు ఆదివారం వారు అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, శేషవస్త్రాలతో సత్కరించారు.

## మట్టి విగ్రహాలనే పూజిద్దాం


స్థానికులకు బొమ్మల తయారీ గురించి వివరిస్తున్న సభ్యులు

సింహాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితికి ప్రతిఒక్కరూ మట్టి ప్రతిమలనే పూజించాలని తరలి ఆర్ట్స్ సంస్థ ప్రతినిధులు కోరారు.ఆదివారం వారు 98వ వార్డులోని ఎంఎంటీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానికులకు మట్టి ప్రతిమలు చేయడంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రియదర్శిని, గౌతమ్, షణ్ముఖ్, తదితరులు పాల్గొన్నారు.

## 'తెలికుల సంఘాలను బలోపేతం చేస్తాం'



సభ్యులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న నాయకులు

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని తెలికుల సంఘాలను బలోపేతం చేయడంతో పాటు సంక్షేమానికి కృషి చేస్తామని అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శంకరరావు అన్నారు. ఆదివారం చిన్నబజారులో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జిల్లా తెలికుల సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. విశాఖ నగర అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉన్న కమిటీలను సందర్శించి, ఇంటింటి సర్వే చేస్తామన్నారు. అనంతరం సభ్యులు అంబటి శంకరరావును సత్కరించారు. అలాగే సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు జామి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వలల భద్రతకు మత్స్యకారుల అవస్థలు


అన్నవరంలో ఆరుబయట కుప్పలుగా ఉన్న వలలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ల సమయంలో తీర ప్రాంత మత్స్యకారులు వలలు భద్రపరుచుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.తీరంలో షెల్టర్లు లేకపోవడంతో కుప్పలుగా పోసి పరదాలు గానీ, చిరిగిపోయిన వలలను కాని రక్షణగా కప్పుతున్నారు. వలల్లో చిక్కుకున్న చిన్న చేపల అవశేషాలను తినడానికి ఎలుకలు చేరుతుంటాయి. ఇవి వలలను కొరికి వేస్తుండడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు. మండలంలోని తిమ్మాపురం నుంచి భీమిలి వరకు ఏడు తీర గ్రామాలు ఉండగా, భీమిలి నుంచి అన్నవరం వరకు నాగమయ్యపాలెం,చిననాగమయ్యపాలెం, ఎర్రయ్యపాలెం తదితర ఆరు గ్రామాలు ఉన్నాయి. వీటిలో పడవలపై వేటకు వెళ్లే మత్స్యకారులు 3200 మంది ఉన్నారు. మర పడవలు ఉన్న వారిలో 1278 మందికి పెద్ద వలలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో సామాజిక భవనాలు ఉన్నా.. వాటిలో వలలు దాచుకోవడానికి అవకాశం లేదు. అధికారులు స్పందించి వలల భద్రతకు రెండు. మూడు షెల్టర్లు నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

## ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

ఆనందపురం ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం పంచాయతీలోని ఎస్సీ, బీసీ కాలనీలో ఉన్న దుర్గమ్మ ఆలయం ఏడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం వేద పండితులతో గణపతి పూజ, చండీహోమం, పూర్ణాహుతి జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మూడు వేల మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. పూజారి కడమంచి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చందక అప్పలస్వామి, నాయకులు పిణగం రామారావు, నాగరాజు, చందక శంకర్రావు, మేడిశెట్టి రాంజీ, కెల్లా రమణ, అప్పారావు, పెంటయ్య, శ్రీను, ధనియాల అప్పలనారాయణ పాల్గొన్నారు.



## చంద్రంపాలెంలో బోరు ఏర్పాటు

మధురవాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడోవార్డు పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ తెలిపారు. ఆదివారం ఆమె చంద్రంపాలెంలో జీవీ ఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికులు తాగునీటి సమస్య గురించి తెలియజేయడంతో ఎమ్మెల్యే గంటా దృష్టికి తీసుకువెళ్లి బోరు మంజూరు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, వార్డు అధ్యక్షుడు పిళ్లా నరసింగరావు, నాగోతి శివాజీ, పిళ్లా రాము, పీఏసీఎస్ చైర్మన్ పోతిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## రుషికొండలో ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న ఏఆర్ ఉన్నతాధికారులు

సాగర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ పిలుపుమేరకు ఏపీ పోలీసు విభాగం ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని రుషికొండలో ఆదివారం ప్రారంభించారు. ఉదయం 6.30 గంటలకు రుషికొండ నుంచి ఈ ర్యాలీ ప్రారంభమైంది. సైక్లింగ్‌తో పాటు యోగా, జుంబా, రోప్ స్కిప్పింగ్ వంటి ఇతర ఫిట్‌నెస్ కార్యక్రమాలు కూడా నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా విశాలాక్షినగర్ వద్ద జరిగిన ర్యాలీలో ఏఆర్ డీఎస్పీ పి. నాగేశ్వరరావు మాట్లాడుతూ సైక్లింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి ఏఆర్ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కైలాసగిరి ఆర్మ్‌డ్ పోలీసు రిజర్వు కార్యాలయం నుంచి సాగర్‌నగర్ వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.


పుష్కరిణిలోకి వర్షపు నీరు వచ్చే మార్గంలో పేరుకుపోయిన తుప్పలు

## పుష్కరిణిలో నీటి ప్రవాహ మార్గాలు మూసివేత

సింహాచలం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కొండదిగువ పుష్కరిణిలోకి వర్షం నీరు వచ్చే మార్గాలు మూసుకుపోయాయి. దీంతో భారీ వర్షాలు కురుస్తున్నా.. పుష్కరిణిలో నీటి మట్టం పెరగడం లేదు. సుమారు పది ఎకరాల విస్తీర్ణం లో ఉన్న పుష్కరిణిలోకి ఏటా వర్షాకాలంలో వచ్చే నీరే ప్రధాన ఆధారం. పుష్కరిణిలో నీటి నిల్వలను బట్టి గ్రామంలోని మూడు ప్రధాన వీధుల్లో భూగర్భ జలాలు ఆధారపడి ఉంటాయి. గతంలో పుష్కరిణిలోకి సింహగిరిపై కురిసిన వర్షపునీరు పాతఅడివివరం, దారపాలెం మీదుగా గెడ్డల ద్వారా వచ్చి చేరేది. ఇటీవల పాత అడివివరం నుంచి హనుమంతువాక వరకు, తొలిపావంచా నుంచి పాతఅడివివరం కూడలి వరకు జీవీఎంసీ బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మించింది. ఈ సమయంలో ఇంజినీర్లు పుష్కరిణిలోకి వచ్చే నీటి ప్రవాహ మార్గాలను మూసివేశారు. దీంతో భారీ వర్షాలు కురుస్తున్నా.. పుష్కరిణిలోకి నీరు చేరడం లేదు. జీవీఎంసీ, దేవస్థానం అధికారులు స్పందించి పుష్కరిణిలోకి వచ్చే నీటి ప్రహవా మార్గాలకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

## విచ్చలవిడిగా పందుల సంచారం


సాగర్‌నగర్ కాలనీ ప్రధాన రహదారిపై పందులు

సాగర్‌నగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కాలనీ ఆవిర్భవించి సుమారు 30 ఏళ్లు కావస్తోంది. ఎప్పుడూ పందుల సంచారం లేదు. కానీ గత రెండేళ్లుగా ఈ సమస్య నెలకొంది. ముఖ్యంగా హెచ్‌ఐజీ టు కాలనీలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. పందుల వల్ల పరిసరాలు పాడై దోమలు వృద్ధి చెందుతుండ డంతో ఎప్పుడు ఏ వ్యాధి వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## ప్రియుడు పెళ్లికి తిరస్కరించడంతో యువతి ఆత్మహత్య

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగిన వ్యక్తితో సహజీవనం చేస్తున్న యువతి, అతడు పెళ్లికి తిరస్కరించడంతో ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన కొల్లపూడి రమ్య (21), మెడ నరేష్ ప్రేమించుకున్నారు. నరేష్‌కు ఇదివరకే వివాహమైంది. ఈనెల 11న ఇద్దరు కలసి విశాఖ వచ్చి టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొబ్బరితోట వద్ద ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. ఈక్రమంలో రమ్య తనను వివాహం చేసుకోవాలని రెండు రోజులుగా అడుగుతోంది. తనకు ఇప్పటికే వివాహం జరిగినందున, ఇలాగే ఉందామని నచ్చజెప్పాడు. ఒకసారి ఖమ్మం వెళ్లి వస్తానని బయలుదేరాడు. తాను ఇంక నరేష్‌ను వివాహం చేసుకోవడం కుదరదని భావించి తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య శనివారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు గమ నించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమె మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. నరేష్‌ను విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## మండపాలు నిరుపయోగం!

... 5వ పేజీ తరువాయి

సింహాచలం, వేపగుంట, పెందుర్తి, ముడసర్లోవ, తదితర ప్రాంతాల్లో అత్యాధునిక హంగులతో కల్యాణ మండపాల నిర్మాణానికి సింహాచల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ముందుగా సింహాచలం ప్రధాన రహదారికి అనుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల స్థలంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీదేవి కాంప్లెక్స్ పేరుతో 2019లోనే రూ.3.5 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. ఇందులో దిగువ అంతస్థులో దుకాణాల సముదాయం, పైఅంతస్థులో నాలుగు కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

### అవగాహన లేని పనులు

అయితే సరైన అవగాహన, పక్కా ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో ఇవి ఎందుకూ కొరగాకుండా మిగిలిపోయాయి. కల్యాణ మండపాల్లో సాధారణంగా పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెకు ప్రత్యేక గదులు నిర్మించాలి. వాటితో పాటు మరుగుదొడ్లు తప్పనిసరి. అయితే శ్రీదేవి కాంప్లెక్స్‌లోని నాలుగు కల్యాణ మండపాల్లో ఇవేవీ నిర్మించలేదు. దీంతో వివాహాది కార్యక్రమాలు నిర్వహించే వారికి పనికిరాకుండా పోయాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు కావడంతో వాటిలో ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులకు వసతి కల్పిస్తున్నారు.

### వినియోగానికి దూరంగా...

దీంతో పాటు సత్తెమ్మతల్లి ఆలయానికి ఎదురుగా దేవస్థానానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్లకు పైగా వ్యయంతో నాలుగు కల్యాణ మండపాల కాంప్లెక్స్ నిర్మించారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు ఏప్రిల్ 26న ఇక్కడ మంత్రుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ తరువాత కల్యాణ మండపాల కాంప్లెక్స్‌ను వినియోగించిన దాఖలాలు కనిపించ లేదు. దీనికి కారణాలపై ఆరా తీయగా ఆ భవనానికి విద్యుత్ సరఫరా కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాల్సి ఉందని తెలిసింది. మిగిలిన కల్యాణ మండపాల నిర్మాణాల మాటెలా ఉన్నా, ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన వాటినైనా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## జల వనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. రుతుపవనాలు సీజన్ గోదావరికి వచ్చే వరదపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇటువంటి సమయంలో వారు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం ఇత్యాది అంశాలను సమీక్షించి ఆదేశాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని జల వనరుల శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల ఈఈలకు మూడు పాత జిల్లాల్లో ఎస్ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే సబబుగా ఉండేదని వ్యాఖ్యానిస్తున్నారు. జల వనరుల శాఖలో డీఈ, సీఈల ఖాళీలను భర్తీచేయకుండా కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తరాంధ్రలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇక్కడ ఖాళీలను భర్తీచేసేలా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

## సీడబ్ల్యూసీలకు ఆన్‌లైన్ బుకింగ్

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ల (సీడబ్ల్యూసీ) నిర్వహణ బాధ్యతల నుంచి ఉద్యోగ సంఘాలను తప్పిస్తూ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్లాంటులో బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రం, ఆంధ్ర కేసరి కళాక్షేత్రం పేరుతో రెండు సీడబ్ల్యూసీలు ఉన్నాయి. వాటిని ఉద్యోగుల కుటుంబాలు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అద్దెకు ఇస్తుంటారు. ఇప్పటివరకూ వాటిని కేటాయించే అధికారం గుర్తింపు సంఘం నాయకులకు ఉండేది. ఇప్పుడు యాజమాన్యం ఆ హక్కును తీసేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఎవరికైనా కమ్యూనిటీ హాళ్లు కావాలనుకుంటే వైజాగ్ స్టీల్ డాట్ కామ్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సర్క్యులర్ జారీచేసింది.


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పోతన్నరెడ్డి తదితరులు


బీచ్‌రోడ్డు : ఆర్కే బీచ్‌లో రోటరీ క్లబ్ చేపట్టిన కార్యక్రమంలో ప్రతిమలు అందజేస్తున్న జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి


మట్టి వినాయక ప్రతిమలనే వాడాలంటూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న కళాకారులు

# పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు » పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ » పీసీబీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

పెదవాల్తేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. టీడీపీ 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పెదవాల్తేరు గాంధీ బొమ్మసెంటర్ వద్ద ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలను ఎమ్మెల్యే రామకృష్ణబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మట్టి గణపతినే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల నిమ్మజ్జనం వల్ల జల కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ రసాయన పదార్థాలు వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. సహజ సిద్ధమైన మట్టితో రూపొందించిన వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో బైరెడ్డి రాజ్యలక్ష్మి, బీజేపీ రాజు, అనిల్, రమణ, పండా శ్రీను, మాదడా సీతాన్నరెడ్డి, వాసు, మద్దె శ్రీను, కాకి శివ, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో..**

బీచ్ రోడ్డు, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆర్కే బీచ్ వద్ద విశాఖ రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహితంగా వినాయకచవితి పండుగను జరుపుకోవాలని సూచించారు. మట్టితో రూపొందించిన ప్రతిమలను మాత్రమే పూజకు వినియోగించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించడానికి గుడ్డతో తయారు చేసిన సంచులను అందించడంలో హెచ్‌పీసీఎల్ సంస్థ తీసుకున్న చొరవ స్ఫూర్తిదాయకమన్నారు. పీఆర్ఎస్ఐ విశాఖ శాఖ అధ్యక్షుడలు ఎంకేవీఎల్ నరసింహం మాట్లాడుతూ రంగులు, ప్లాస్టిక్ ఆఫ్ పారిస్‌లతో తయారు చేసే విగ్రహాలు చూడడానికి బాగున్నప్పటికీ వాటిని నిమజ్జనం చేయడం వలన నదులు, సముద్ర జలాలు ప్రమాదకర రసాయనాలతో కలుషితమవుతున్నాయన్నారు. పర్యావరణానికి హాని కలుగకుండా మట్టి ప్రతిమలను వాడడం వలన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. అనంతరం సుమారు 1200 ప్రతిమలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ కార్యదర్శి ఎ.గోవిందరావు, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి భార్గవ్‌మహర్షి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**కళా ప్రదర్శన ద్వారా ప్రచారం..**

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను వినియోగించకుండా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలంటూరాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు, రైతులకు మట్టి విగ్రహాలపై అవగాహన కలిగించడానికి ఆదివారం కళాకారులతో లఘు నాటికలు ప్రదర్శింపజేసింది. డప్పు, మైకు, కళాకారుల ఆటపాటా ద్వారా తగిన ప్రచారాన్ని నిర్వహిస్తోంది.

## జనసేన సమావేశంలో భద్రత ఏర్పాట్లు

» పోలీసు అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన


పోలీసు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, జనసేన నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జనసేన పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పోలీసు అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. సమావేశం నిర్వహించనున్న ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో పోలీసు అధికారులతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించే పార్టీ కార్యవర్గ సమావేశానికి సుమారు 15 వేల మంది హాజరవుతారని, అందులో ఐదు వేల మంది వీరమహిళలు ఉంటారని, అందువల్ల పలు జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు వాహనాల్లో తరలిరానున్నందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీపీ, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'రక్తదానం ప్రాణదానంతో సమానం'


రక్తదానం చేస్తున్న త్రీ టౌన్ సీఐ పైడియ్యా తదితరులు

పెదవాల్తేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రాణాలు కాపాడే రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ గొప్పవారే అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకటపట్టాభిరామ్, త్రీ టౌన్ సీఐ పైడయ్య పేర్కొన్నారు. మదర్ థెరెసా జయంతిని పురస్కరించుకొని ఒలిశెట్టి సత్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం వాల్తేరు డిపో పెదజాలారిపేట రామాలయం కల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వెంకట పట్టాభిరామ్, సీఐ పైడయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో యువతీయువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం

**అఘాయిత్యానికి పాల్పడిన చిన్నాన్న**

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో శని వారం రాత్రి బాలికపై అత్యాచారం జరిగింది. వరుసకు కూతురు అయ్యే పదమూడేళ్ల బాలికపై చిన్నాన్న ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిదేళ్ల క్రితం విశాఖ నగరం నుంచి ఆటో డ్రైవర్ కుటుంబం బతుకు తెరువు కోసం భీమునిపట్నం వచ్చింది. భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం వుంటున్నారు. వదిన (భార్య అక్క) కుమార్తె కూడా వీరితోపాటే ఉంటున్నది. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వదిన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం రక్తస్రావంతో బాలిక ఇబ్బంది పడుతుం డడాన్ని చిన్నమ్మ (ఆటో డ్రైవర్ భార్య) గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు ఏం జరిగిందని బాలికను అడిగారు. రాత్రి జరిగిన అఘాయిత్యం గురించి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆస్పత్రి కి వచ్చి బాలికను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు భీమునిపట్నం వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ తిరుమలరావును వివరణ కోరగా.. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవాలి

» సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు


జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, మాజీ మేయర్ హరివెంకటకుమారి తదితరులు

సిరిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం భరత నాట్య కళాశాల స్కూలుకు చెందిన 180 మంది నృత్య కళాకారులు 20 నాట్య బృందాలు నిర్వహించిన ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాజీ మేయర్ హరి వెంకటకుమారి, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురుహరిరామ్మూర్తి, విశాఖ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, చెన్నై కళాక్షేత్ర ప్రిన్సిపాల్ వసుంధరలతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవడం ద్వారా జీవితంలో ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. మాజీ మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ సంప్రదాయ కళల ద్వారా మన సంస్కృతిని చాటిచెప్పవచ్చన్నారు. తదుపరి నిర్వహించిన నృత్య కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథుల చేతులమీదుగా నృత్య కళాకారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.


నృత్య ప్రదర్శన ఇస్తున్న భరతనాట్య కళాశాల స్కూలు విద్యార్థులు

## విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటుపరం కాబోదు

**కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ**

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాబోదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. తిరుపతిలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి వెళుతున్న కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డిని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తున్నారా అని విలేకరులు అడిగారు. ఈ సమయంలో రాజకీయాలు మాట్లాడనని కిషన్‌రెడ్డి చెప్పగా.. శ్రీనివాసవర్మ మాత్రం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకూడదదే కేంద్రప్రభుత్వం రూ.11,500 కోట్లు కేటాయించిందన్నారు. ఇది చూస్తూ కూడా ప్రైవేటుపరం చేస్తున్నారని మీరెలా అడుగుతారని ప్రశ్నించారు.

## భర్త అదృశ్యంపై ఫిర్యాదు


నాగేశ్వరరావు (ఫైల్)

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కాలనీలోని తొమ్మిదో సెక్టరు ప్రాంతంలో ఉంటున్న తన భర్త కనిపించడం లేదంటూ మహిళ ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ మురళీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

తన భర్త గుండారపు నాగేశ్వరరావు (65) కనిపించడం లేదంటూ ఆయన భార్య గుండారపు కాంతమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాను హైదరాబాద్‌లో ఉండగా, ఈ నెల 18న తన భర్త నాగేశ్వరరావు నక్కపల్లి సమీపంలోని డొంకాడకు తన టీవీఎస్ బైకుపై వెళ్తున్నట్టు తమ పై అంతస్తులో అద్దెకుంటున్న వారికి చెప్పారని, తాను 19న ఇంటికి వచ్చి, తన భర్తకు ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చినట్టు పేర్కొన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

» వినాయక ఉత్సవ నిర్వాహకులకు సీఐ మల్లేశ్వరరావు హెచ్చరిక

ఆరిలోవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాల నిర్వహణ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల మండపాల నిర్వాహణకు ఏర్పాటుకు నిర్వహకులు పోలీసుల అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మండపాల వద్ద గాని, నిమజ్జన సమయంలో గాని డీజే సౌండ్స్ నిషిద్ధమన్నారు. పోలీసుల ఇచ్చే సూచనలను నిర్వాహకులు పాటించాలని తెలిపారు. పందిళ్లకు 11 రోజులకు మించి అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే కార్యక్రమాలకు సహించబోమని తెలిపారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాలలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదన్నారు. మండపాల్లో చిన్నపాటి సౌండ్స్ వచ్చే మైకులను మాత్రమే వాడుకోవాలని సూచించారు. మండపాలు ఏర్పాటుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. జనజీవనానికి ఇబ్బంది లేకుండా వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

## యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెం ప్రాంతానికి చెందిన యువతి అదృశ్యం అయినట్టు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. యువతి తల్లి కోరాడ విజయలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. నగరంలోని ఓ పార్లర్‌లో మౌనిక గాయత్రి (25) ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 21న ఇంటి నుంచి పార్లర్‌కు బయలు దేరిన యువతిమౌనిక గాయత్రి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచాఫ్‌లో ఉంది. ఇంట్లో ఉండాల్సిన ఆరు తులాల బంగారం కూడా కనిపించడం లేదని మౌనిక గాయత్రి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

## జూ పార్కుకు రూ.2.98 లక్షల ఆదాయం

ఆరిలోవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. సుమారు 3 వేల 5 వందల మంది సందర్శించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి రూ.2,98,740 ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడించారు. ప్రధానంగా సీతాకోక చిలుకల పార్కు, తెల్ల పులుల మోటుల వద్ద సందర్శకుల సందడి కనిపించింది. పలువురు సందర్శకులు ఇక్కడ సెల్ఫీలు తీసుకొంటూ కనిపించారు. సందర్శకులు అధికంగా రావడంతో జూలో కోలాహలం కనిపించింది.

## సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

**కోడిగుడ్లు (నెక్)** (వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

**చికెన్ ధరలు**

| బ్యాగ్ | |
|---|---|
| రైతు ధర | 108 |
| లైవ్ ధర | 128 |
| విత్ స్కిన్ | 226 |
| స్కిన్‌లెస్ | 236 |

## గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో సామూహిక కుంకుమార్చనలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వెంకోజీపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. లలితా సహస్ర పారాయణ చేస్తూ మహిళలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి బాలభాను అర్చక, పురోహిత సంఘం అన్ని సామాగ్రిని సమకూర్చింది. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు ఆరవెల్లి సూర్యప్రకాశరావు దంపతులు, అధ్యక్షులు జోష్యుల కామేశ్వరశర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘం కార్యదర్శి మావుడూరు కిషోర్ కుమార్ శర్మ సర్వేజనా సుఖినోభవంతు అంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రపంచంలో ప్రజలందరూ సుఖశాంతులతో కలిసిమెలిసి ఉండాలని, ఆకాంక్షిస్తూ అమ్మవారికి పూజలు చేశామన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి మహా ప్రసాదాన్ని అందజేశారు.

## విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు


క్రీడాకారులతో ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, రాష్ట్ర స్థాయిలో తైక్వాండో పోటీలో విజేతలుగా నిలిచిన బాలలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయం వద్దకు వచ్చిన విజేతలు, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఆరిలోవ కాలనీకి చెందిన బాబా తైక్వాండో అకాడెమీ నుంచి ఈ ఏడాది సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో పలు పతకాలను సాధించారు. వారి మెడలో పతకాలను ఎమ్మెల్యే వేశారు. ధ్రువపత్రాలను అందించారు. వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కర్ణాటక, హిందూస్థానీ గాత్రకచేరి



గాత్ర కచేరి చేస్తున్న పూర్ణిక కృష్ణన్, నివేదిత భట్టాచార్య

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కర్ణాటక, హిందీస్థానీ గాత్ర కచేరి అలరించింది. ముంబైకు చెందిన పూర్ణికకృష్ణన్ కర్ణాటక గానం, కోల్‌కతాకు చెందిన నివేదిత భట్టాచార్య హిందుస్థానీ గానం ఒకరికొకరు పోటీగా అనిపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా 'వాతాపి గణపతింభజే.' కర్ణాటక, హిందుస్థానీలో హంసధ్వని రాగంలో ఆదితాళం ముత్తుస్వామి దీక్షితర్ కృతి పాడి మెప్పించారు. హిందుస్థానీలో యమన్ తాగం అదే కర్ణాటక సంగీతంలో కల్యాణీ శాఖీ ఏరిఅలీ పియా బిన్‌రాగ్ కృతిని ఇద్దరు స్వరకల్పన చేసి రక్తి కట్టించారు. 'రాగం తానం పల్లవి' పాటను కల్యాణి రాగం, ఆదితాళంలో చక్కని సాహిత్యంతో ఆలపించగా ఆడిటోరియం చప్పట్లతో మారుమోగింది. చివరగా 'వందేమాతరం' గీతం పాడుతూ దేశభక్తిని చాటిచెప్పారు.

కార్యక్రమంలో రియల్ అడ్మిరల్ కె.శ్రీనివాస్, కళాభారతి నిర్వాహకులు మంతెన సత్యనారాయణరాజు, రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటు



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీజీవో సమావేశం మందిరంలో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటు చేశారు. ఏపీ ఎన్జీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్ ఆధ్వర్యంలో ఈ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా జీవీ అప్పారావు, ఉపాధ్యక్షుడుగా బి.రామారావు, కార్యదర్శి బీసీహెచ్ సుధాకర్, సహాయ కార్యదర్శి కె.జగదీశ్వరరావు, మహిళా కార్యదర్శిగా బి.సుశీల, కోశాధికారిగా ఎస్.మురళీమోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేసీహెచ్ నాయుడు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ముగ్గురు పిల్లలను రక్షించిన లైఫ్ గార్డ్స్


పోలీసులు, లైఫ్‌గార్డ్సలలో పిల్లలు

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో ఆదివారం సాయంత్రం సముద్ర అలలకు కొట్టుకుపోతున్న ముగ్గురు బాలురను లైఫ్‌గార్డ్స్ సిబ్బంది రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. పూర్ణామార్కెట్ కళ్లపాకలు ఏరియాకు చెందిన రియాసత్ (10), ఎర్ని కుమార్(13), వి.శశికుమార్ (13)లు ఆర్కే బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానానికి దిగి ఆటాలాడారు.

అంతలో అలల ఉధృతి ఎక్కువ కావడంతో ఈ ముగ్గురు లోపలకు వెళ్లిపోయారు. ఇది గమనించిన బీచ్ లైఫ్ గార్డ్స్ వెంటనే సముద్రంలోకి దిగారు. అలల్లో కొట్టుకుపోతున్న రియాసత్, శశికుమార్, కుమార్లను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొనివచ్చారు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి పిల్లలను అప్పగించారు. ప్రాణాలకు తెగించి ముగ్గురు పిల్లలను రక్షించిన లైఫ్‌గార్డ్స్‌ను త్రీటౌన్ సీఐ పైడయ్య అభినందించారు.

## మురళీనగర్‌లో 247 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మురళీనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానికులు వినియోగించుకున్నారు. నగరంలోని ఐను నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఇన్‌స్టిట్యూట్, వాసన్ ఆసుపత్రి వైద్యుల సమన్వయంతో శిబిరం నిర్వహించారు. 247 మంది ఆరోగ్య పరీక్షలకు విచ్చేశారు. డాక్టర్ జి.రవీంద్ర, శ్రీరామ్ తదితరులు సాధారణ చికిత్సలు, కంటి వైద్య సేవల్ని అందించారు. మురళీనగర్, మాధవధార ప్రాంతాలు సహా ఎన్‌జీజీఓస్ కాలనీ, మర్రిపాలెం తదితర ప్రాంతాల నుంచి పలువురు విచ్చేసి సేవలు పొందారు.. క్లబ్ కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### బ్రహ్మకుమారీల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

బ్రహ్మకుమారీ ఆశ్రమాల దాది ప్రకాశమణి 18వ అవ్యక్త పుణ్య దివస్‌ను ఆదివారం మురళీనగర్ శాంతిధామంలో నిర్వహించారు. బ్రహ్మకుమారీల సేవా విభాగం నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సెంటర్ ఇంఛార్జి బి.కె.అపరంజి పర్యవేక్షణలో ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సాయంతో శాంతిధామం ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వైద్యుడు యశ్వంత్, సిబ్బంది యువత నుంచి రక్తాన్ని సేకరించారు.

## స్వచ్ఛతను కాపాడుదాం




స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆదివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సూచించారు. వ్యాధులను నివారించేందుకు, ఆహ్లాదకర వాతావరణం, పరిపూర్ణ ఆరోగ్యం పొందేందుకు పరిసరాల్లో ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛాంధ్ర సమన్వయకర్త నిర్మలకుమారి మాట్లాడుతూ అపరిశుభ్రత వలన కలిగే సమస్యలను వివరిస్తూ తాగునీటి శుభ్రత, ఆహార అలవాట్లపై అవగాహన కలిగించారు.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.50 వేల విలువైన 10 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కర్ణాటకకు చెందిన రసూల్ (27), షాదీక్ హుస్సేన్‌లు బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తూ దొరికారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

## ముస్లిం యువతకు ఉచితంగా వివాహాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముస్లిం వెల్ఫేర్ సొసైటీ తరఫున పేద యువతీ యువకులకు ఉచితంగా వివాహం చేయనున్నట్లు అధ్యక్షుడు హైదరాలి సింకా తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో ఆదివారం పేద ముస్లిం యువతీ, యువకులకు వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి 200 మంది యువతీ, యువకులు, వారి తల్లిదండ్రులు విచ్చేశారన్నారు. వారి అర్హతల మేరకు తల్లిదండ్రులు వధూవరులను నిర్ణయించుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునీర్ ఖాన్ బాబా, షేక్ అబ్దుల్ మునీర్ పాల్గొన్నారు.

## వేలాడుతున్న చెట్ల కొమ్మలు తొలగించరూ..!

సీతంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట-శాంతిపురం రోడ్డులో గల చెట్టు కొమ్మలు విరిగి రహదారికి అడ్డంగా వేలాడుతున్నాయి. దీనివల్ల అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చెట్టు కొమ్మలు వాలిపోయి కిందగా ఉండటంతో ఆ రహదారి మీదుగా ప్రయాణించే వారు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వర్షకాలం సమీపించడంతో సీతంపేట, సీతమ్మధార ప్రాంతాల్లో రహదారుల పక్కన వేలాడుతున్న చెట్టు కొమ్మలను వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

# శ్రీనివాసనగర్‌లో నెల రోజులుగా అంధకారం!



శ్రీనివాసనగర్‌లో ఆదివారం రాత్రి సెల్ టార్చ్‌లతో నిరసన తెలుపుతున్న స్థానికులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఆదివారం రాత్రి సెల్ ఫోన్ల టార్చ్ లైట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం ప్రాంతంలో గత నెల రోజుల నుంచి వీధి లైట్లు వెలగడం లేదని చెప్పారు. ఇవి వెలగకపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అయినా విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### చీకటిలో బస్ బే

అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారిలోని సౌత్ బస్ బే వద్ద లైట్లు వెలగకపోవడంతో చీకటి అలుముకుంది. ఆ ప్రాంతం అంధకారంలో ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో దొంగల భయం ఉందని ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో పట్టపగలే ఓ మహిళ మెడలో గొలుసు తెంపి పారిపోతుంటే స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.




అక్కయ్యపాలెంలో చీకటిగా ఉన్న బస్ బే ప్రాంతం

బస్ బే దగ్గర నిలబడితే చీకటిగా ఉండడం వల్ల ఏ వాహనం ఢీకొడుతుందోనని, అలాగే దొంగలు ఎటు నుంచి వచ్చి తమను దోచుకుంటారోనని ప్రయాణికులు భయాందోళ చెందుతున్నారు. కొద్ది రోజుల నుంచి లైట్లు వెలగడం లేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం



వినాయక ప్రతిమల్ని అందజేస్తున్న కృష్ణారెడ్డి, వరప్రసాద్ తదితరులు

మాధవధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు సమీపంలోని రామాలయంలో ఆదివారం గణపతి మట్టి పూజా ప్రతిమల్ని ఉచితంగా అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త, స్వాతి ప్రమోటర్స్ నిర్వాహకులు కృష్ణారెడ్డి పలువురికి ప్రతిమలను అందజేశారు. మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం' అంటూ ఆయన స్థానికులకు సూచించారు. రామాలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి ఎస్.వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాలుష్య నివారణకు ఏటా మట్టి గణపతి విగ్రహాలను, పూజా పుస్తకాల్ని అందించడం తమ ఆలయ ఆనవాయితీగా పాటిస్తున్నట్లు కమిటీ ప్రెసిడెంట్ టి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. పర్యావరణానికి హానిచేసే పూజా హంగామాకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన కోరారు.

### కళా ప్రదర్శన



నరసింహనగర్‌లో కళాకారుల ప్రదర్శన

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి ప్రతిమలు మాత్రమే వినాయక చవితి పూజలకు వినియోగిద్దామని సూచిస్తూ నరసింహనగర్ రైతుబజారులో ఆదివారం కళాకారులు చైతన్య ప్రదర్శన నిర్వహించారు. పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కొండబాబు మాట్లాడుతూ వినాయక విగ్రహాలకు వివిధ రకాల రంగులు వేయకుండా కేవలం మట్టితో చేసిన వాటిని మాత్రమే ఉపయోగించాలన్నారు.

## రేషన్ డిపోలకు చేరిన స్మార్ట్ కార్డులు



కొత్త కార్డుల్ని రేషన్ డిపోకి తీసుకెళ్తున్న ఓ డీలరు

మాధవధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయడానికి కొత్త స్మార్ట్ కార్డులు చౌకడిపోలకు చేరాయి. సర్కిల్ 1 పౌరసరఫరాల కార్యాలయ పరిధిలోని మాధవధార, కంచరపాలెం, మురళీనగర్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని 185 మంది డీలర్లకు ఆదివారం వీటిని అందించారు. స్మార్ట్‌కార్డులను ఏఎస్‌ఓ శ్రీహరి డీలర్లకు అందజేశారు. కొత్త కార్డులో కార్డుదారుని ఫొటో, కుటుంబ వివరాలు, చిరునామాతో కూడిన క్యూఆర్‌కోడ్ ఉన్న కొత్త కార్డుల్ని అందించారు. కొత్త కార్డులను స్వైప్ చేసే అవకాశం, క్యూఆర్‌కోడ్ స్కాన్ విధానం ఈ పాస్ యంత్రాల్లో లేనందున ఆగస్టు నెలకు పాత పద్ధతిలోనే ఈ పాస్ యంత్రాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తారు. పౌర సరఫరాల శాఖకు చెందిన కొత్త యాప్‌ను ఆశాఖ కార్యాలయంలోనే ఆదివారం ఇన్‌స్టాల్ చేసి అందించారు. తరువాత క్రమంగా కొత్త కార్డుల కోసం ఈ పాస్ యంత్రాలను సమకూరుస్తారు. కార్డుదారులకు ఎప్పుడు అందించాలన్నది సచివాలయ సిబ్బందితో అనుసంధానం చేసుకుని డీలర్లకు మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

# సుదీర్ఘ సినీ జీవితంపై కరాటే ప్రభావం: సుమన్ తల్వార్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరాటే వంటి యుద్ధ విద్య (మార్షల్ ఆర్ట్స్) సాధన ద్వారా క్రమశిక్షణ, మంచి నడవడిక, ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం పెంపొందుతాయని సినీ నటుడు సుమన్ తల్వార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జరిగిన కరాటే సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 48 ఏళ్ల తన సినీరంగ జీవితానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడిందన్నారు. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా హీరోగా సుమారు 200 చిత్రాలు సహా, ఇప్పటివరకు అన్ని భాషలలో కలిపి 800 సినిమాల్లో నటించగలగడానికి మార్షల్ ఆర్ట్స్ ద్వారా పొందిన ఆత్మవిశ్వాస ప్రభావం ఉందన్నారు. సినిమాలలో బిజీగా ఉన్నా కరాటే సంఘాల పిలుపునకు సమ్మతి తెలుపుతూ ఈ విద్యపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా క్రమం తప్పకుండా కరాటే సెమినార్ నిర్వహిస్తున్న చిగురుపల్లి సతీష్‌కుమార్ అభినందనీయుడని, ఇటువంటి సదస్సుల ద్వారా కరాటే క్రీడకు ప్రాచుర్యం, ప్రాధాన్యం, ఔత్సాహికులలో స్ఫూర్తి నింపుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం సెవెంత్ (7వ) డాన్ బ్లాక్ బెల్ట్ పొందిన సతీష్‌కుమార్‌కు సుమన్ తల్వార్, వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జి రాజేష్ అగర్వాల్ బెల్ట్, ధ్రువపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు, పేడాడ రమణకుమారి, సెమినార్ ప్రధాన నిర్వాహకుడు సిహెచ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది కరాటే బెల్ట్ సాధకులు పాల్గొన్నారు.



సతీష్‌కు (7వ) డాన్ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేస్తున్న సుమన్ తల్వార్

## విద్యార్థులకు రూ.25 లక్షల స్కాలర్ షిప్పుల పంపిణీ




విద్యార్థికి చెక్కు అందచేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

సీతమ్మధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ కల్యాణమండపంలో పేద, ప్రతిభావంత విద్యార్థులకు రూ25 లక్షల స్కాలర్ షిప్పులను క్షత్రియ సంక్షేమ సంఘం ఆదివారం పంపిణీ చేసింది. సుమారు 800 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మంతెన రామరాజు రూ.3.5 లక్షలు, మరికొందరు దాతలు తమ వంతుగా సహాయం అందజేశారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, శ్రీకాకుళం జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్యలు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కులను అందచేశారు. క్షత్రియ సమితి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని కొనియాడారు. క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కార్యదర్శి ఆర్వీ గణపతిరాజు, చైర్మన్ జీవీఎస్ఎన్ రాజు, ఎస్ఎస్ఎన్ రాజు, బి.శివాజీ, వి.జానకిరామ రాజు, కెవిబిఎస్ నాగరాజు, జి.మనోహర్, సభ్యులు, డైరెక్టర్లు, యూత్‌సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## పెళ్లికి తిరస్కరించడంతో యువతి ఆత్మహత్య

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగిన వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఓ యువతి, అతడు పెళ్లికి తిరస్కరించడంతో ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన కొల్లపూడి రమ్య (21), మెడ నరేష్‌లు ప్రేమించుకున్నారు. అయితే నరేష్‌కు ఇదివరకే వివాహమైంది. ఈ నెల 11న ఇద్దరు కలసి విశాఖపట్నం వచ్చి టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. ఇంతవరకు సరదాగా తిరిగారు. ఈ క్రమంలో రమ్య తనను వివాహం చేసుకోవాలని రెండు రోజులుగా నరేష్‌ను అడుగుతోంది. తనకు ఇప్పటికే వివాహం జరిగినందున, ఇలాగే ఉందామని నచ్చజెప్పాడు. ఒకసారి ఖమ్మం వెళ్లి వస్తానని బయలుదేరాడు. తాను ఇంక నరేష్‌ను వివాహం చేసుకోవటం కుదరదని భావించి తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య శనివారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి రమ్య కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. నరేష్‌ను విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

# టీడీపీ పునాదులు పటిష్ఠపరచాలి

» దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోని ప్రతీ ఓటరు టీడీపీని బలపరిచేలా పార్టీని గట్టి పునాదులతో నిలపాలని ఎన్టీఆర్ వైద్య సేవ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీతంరాజు సుధాకర్ శ్రేణులకు సూచించారు. ఆదివారం మహారాణిపేటలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ల నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్ ముఖ్యమంత్రి లోకేశ్ అన్న విషయం మరచిపోరాదన్నారు. జగన్ వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, మళ్లీ ఆ పరిస్థితి తీసుకురావద్దని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌గా అమలు జరుగుతున్నాయని అన్నారు. ఇంటింటి సర్వేలో 29వ వార్డులో చురుగ్గా పనిచేసిన మహిళలకు సీతంరాజు సుధాకర్ నగదు పారితోషికాలు అంద జేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, పల్లా రాధ, కోదూరు అప్పల రత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

జ్ఞానాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురం, సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీ, జెఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోఫియా కళాశాల, జూబ్లి పాఠశాలకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎటువంటి రక్షణ లేకపోవడంతో విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం, జనన మరణాల నమోదు కార్యాలయం వద్ద, చర్చి వీధిలోనూ రక్షణలేకుండానే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### జ్ఞానాపురంలో వెలగని వీధి దీపాలు

జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని ఆందోళన చెందుతున్నారు. రాత్రికాగానే సమస్య మరింత జటిలమవుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. 76బి/4,171బి/3 నెంబర్ల గల స్తంభాలకు వీధిదీపాలు రెండు రోజులుగా వెలగడంలేదని, వెంటనే జీవీఎంసీ విద్యుత్ అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆసుపత్రుల్లో సిబ్బంది కొరతతో సేవలకు ఇబ్బంది

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం పరిధిలో సీజనల్ జ్వరాల ప్రభావం తీవ్రంగా ఉంది. గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీ విద్యుత్‌నగర్, 43వ వార్డు శ్రీనివాసనగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లకు వివిధ వ్యాధులతో రోజుకు సుమారు 150 మంది వస్తున్నారు. ఈ రెండు ఆస్పత్రులకు రోజూ వస్తున్నవారిలో జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నారు. వాతావరణ మార్పులు, నీటి కాలుష్యంతో రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రుల్లో జ్వర పీడితులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చికిత్స అందిస్తున్నారు. ఒక్కో ఆస్పత్రిలో వైద్యుడు (మెడికల్ ఆఫీసర్), ఫార్మాసిస్టు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండర్ సేవలు అందిస్తున్నారు. విద్యుత్‌నగర్ పీహెచ్‌సీలో మాత్రం ఫార్మాసిస్టు, స్టాఫ్ నర్స్ లేకపోవడంతో ఉన్న సిబ్బందే అదనపు విధులు నిర్వహిస్తున్నారు. సరిపడా సిబ్బంది లేక రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల సమయం కూడా వృథా అవుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి ఒకే సారి ఎక్కువ మంది రోగులు వస్తే మందులు ఇవ్వాల్సిన ఫార్మాసిస్టు, వైద్య సేవలందించాల్సిన స్టాఫ్ నర్స్ లేకపోవడంతో రోగులు గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అసలే ఆరోగ్యం బాగా లేక వస్తే.. ఆస్పత్రుల్లో ఇలా నిరీక్షించాల్సిరావడం ఇబ్బందిగా ఉంటోందని వాపోతున్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి పీహెచ్‌సీలో కొరత ఉన్న సిబ్బందిని వెంటనే నియమించాలని రోగులు కోరుతున్నారు.



చిన్నారికి థర్మామీటర్‌తో జ్వరం తీవ్రత పరిశీలిస్తున్న ఉద్యోగిని

## రైల్వేస్టేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక సహాయ కేంద్రం




సహాయ కేంద్రం నమూనా

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగా ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ బూత్‌లు ఏర్పాటు చేసేందుకు వాల్తేరు డివిజన్ చర్యలు చేపడుతోందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, శ్రీకాకుళం, రాయగడ తదితర అన్ని ప్రధాన స్టేషన్ల ప్రవేశ ద్వారం, బయటకు వెళ్లే మార్గం వద్ద సహాయ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగులకు అవసరమైన చక్రాల కుర్చీలు (వీల్ చైర్లు), క్రచెస్, ఇతర సహాయ పరికరాలు బూత్ వద్ద పొందేలా సమకూరుస్తామన్నారు. అయితే ఈ బూత్‌లలో సేవలందించేందుకు వైకల్య సంక్షేమం, సాధికారిత రంగాలకు చెందిన ప్రభుత్వేతర సంస్థలు ఉచితంగా వలంటీర్లను అందుబాటులో ఉంచేందుకు ఔత్సాహిక సంస్థలు ముందుకు రావాలని ఆహ్వానించారు. అలాంటి సేవకులకు వాల్తేరు రైల్వే ప్రాథమిక శిక్షణ ఇవ్వనుందని పేర్కొన్నారు. ఆసక్తి గల ఎన్జీవోలు, ఇతర సంస్థలు నగరంలోని డీఆర్ఎం ప్రధాన కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌ను కలవాలని, లేదా డబ్ల్యుఎటిఎస్‌ఆర్‌డిసిఎం @ జీ మెయిల్.కామ్‌లో సంప్రదించాలని తెలిపారు.

## 'హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్ స్వామీజీ

డాబాగార్డెన్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని రాధా మనోహర్ దాస్ స్వామీజీ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భరతమాత ఒడిలో హిందూ ధర్మంపై ఆధారపడి జీవిస్తున్నామని, హిందూ సంప్రదాయ సంస్కృతులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిపోయినప్పటికీ వారి వారసులు కొందరు ఇక్కడ ఉన్నారని, వారు భరత జాతిని చీల్చడానికి, సంపదను కొల్లగొట్టడానికి కుయుక్తులు చేస్తున్నందున, ఇప్పటికీ భారతదేశంలో ఉన్న హిందువులు అభివృద్ధి చెందలేదని వివరించారు. అన్యమత ఉద్యోగులను అధికారులను గుర్తించి తొలగించడంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. న్యాయవాది జి.శ్రీకృష్ణకుమార్ మాట్లాడుతూ హిందూ న్యాయవాదులను ఏకతాటిపైకి తీసుకురావాలన్న ఉద్దేశంతో 14 మంది స్వామీజీలు సంకల్పించారని తెలిపారు. ఈ సమావేశంలో కొల్లూరి రవిశంకర్, డి.ఉమా రాజ్యలక్ష్మి, వినోద్‌కుమార్, కె.సుబ్రహ్మణ్యం, వి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# సీడబ్ల్యూసీలకు ఆన్‌లైన్ బుకింగ్

» నిర్వహణ బాధ్యతల నుంచి ఉద్యోగ సంఘాలను తప్పించిన స్టీల్‌ప్లాంటు యాజమాన్యం

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ల (సీడబ్ల్యూసీ) నిర్వహణ బాధ్యతల నుంచి ఉద్యోగ సంఘాలను తప్పిస్తూ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్లాంటులో బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రం, ఆంధ్ర కేసరి కళాక్షేత్రం పేరుతో రెండు సీడబ్ల్యూసీలు ఉన్నాయి. వాటిని ఉద్యోగుల కుటుంబాలు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అద్దెకు ఇస్తుంటారు. ఇప్పటివరకూ వాటిని కేటాయించే అధికారం గుర్తింపు సంఘం నాయకులకు ఉండేది. ఇప్పుడు యాజమాన్యం ఆ హక్కును తీసేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఎవరికైనా కమ్యూనిటీ హాళ్లు కావాలనుకుంటే వైజాగ్ స్టీల్ డాట్ కామ్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సర్క్యులర్ జారీచేసింది.

## జలవనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. రుతుపవనాలు సీజన్ గోదావరికి వచ్చే వరదపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇటువంటి సమయంలో వారు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం ఇత్యాది అంశాలను సమీక్షించి ఆదేశాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని జల వనరుల శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల ఈఈలకు మూడు పాత జిల్లాల్లో ఎస్ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే సబబుగా ఉండేదని వ్యాఖ్యానిస్తున్నారు. జల వనరుల శాఖలో డీఈ, సీఈల ఖాళీలను భర్తీచేయకుండా కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తరాంధ్రలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇక్కడ ఖాళీలను భర్తీచేసేలా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

# జీవీఎంసీలో ఇక 10 జోన్లు

... 5వ పేజీ తరువాయి

కేటాయించకుండా నియోజకవర్గాల పేరుతో జోన్‌లు ఏర్పాటుచేస్తే ప్రజలకు కూడా స్పష్టత ఉంటుందని సూచించారు. దీంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, అదనపు, జోనల్ కమిషనర్లు నాలుగు నెలల కిందట సమావేశమై వార్డు, జోన్‌ల సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా జోన్‌లు ఏర్పాటు చేస్తే ఏవార్డులు ఎందులో చేరుతాయనే దానిపై ఒక డ్రాఫ్ట్ తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా కావడంతో ఒక వార్డు ప్రజలు జోన్ కార్యాలయానికి రావాలంటే చివరన వుండే వార్డుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని, ఈ నేపథ్యంలో ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లుగా విభజించాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పరిధిలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కోజోన్, భీమిలి, పెందుర్తికి రెండేసి జోన్‌లు ఏర్పాటుకానున్నాయి. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి అనుమతి రాగానే కొత్తజోన్‌ల వ్యవస్థను అమల్లోకి తేనున్నారు.

# మండపాలు నిరుపయోగం!

... 5వ పేజీ తరువాయి

సింహాచలం, వేపగుంట, పెందుర్తి, ముడసర్లోవ, తదితర ప్రాంతాల్లో అత్యాధునిక హంగులతో కల్యాణ మండపాల నిర్మాణానికి సింహాచల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ముందుగా సింహాచలం ప్రధాన రహదారికి అనుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల స్థలంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీదేవి కాంప్లెక్స్ పేరుతో 2019లోనే రూ.3.5 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. ఇందులో దిగువ అంతస్థులో దుకాణాల సముదాయం, పైఅంతస్థులో నాలుగు కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

### అవగాహన లేని పనులు

అయితే సరైన అవగాహన, పక్కా ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో ఇవి ఎందుకూ కొరగాకుండా మిగిలిపోయాయి. కల్యాణ మండపాల్లో సాధారణంగా పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెకు ప్రత్యేక గదులు నిర్మించాలి. వాటితో పాటు మరుగుదొడ్లు తప్పనిసరి. అయితే శ్రీదేవి కాంప్లెక్స్‌లోని నాలుగు కల్యాణ మండపాల్లో ఇవేవీ నిర్మించలేదు. దీంతో వివాహాది కార్యక్రమాలు నిర్వహించే వారికి పనికిరాకుండా పోయాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు కావడంతో వాటిలో ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులకు వసతి కల్పిస్తున్నారు.

### వినియోగానికి దూరంగా...

దీంతో పాటు సత్తెమ్మతల్లి ఆలయానికి ఎదురుగా దేవస్థానానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్లకు పైగా వ్యయంతో నాలుగు కల్యాణ మండపాల కాంప్లెక్స్ నిర్మించారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు ఏప్రిల్ 26న ఇక్కడ మంత్రుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ తరువాత కల్యాణ మండపాల కాంప్లెక్స్‌ను వినియోగించిన దాఖలాలు కనిపించలేదు. దీనికి కారణాలపై ఆరా తీయగా ఆ భవనానికి విద్యుత్ సరఫరా కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాల్సి ఉందని తెలిసింది. మిగిలిన కల్యాణ మండపాల నిర్మాణాల మాటెలా ఉన్నా, ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన వాటినైనా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, పోతన్నరెడ్డి తదితరులు


బీచ్‌రోడ్డు : ఆర్కే బీచ్‌లో రోటరీ క్లబ్ చేపట్టిన కార్యక్రమంలో ప్రతిమలు అందజేస్తున్న జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి


మట్టి వినాయక ప్రతిమలనే వాడాలంటూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్న కళాకారులు

# పర్యావరణ హితంగా పండుగ చేసుకుందాం

» ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు » పలు సంఘాలు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ » పీసీబీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం

పెదవాల్తేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతినే పూజించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. టీడీపీ 20వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి అధ్వర్యంలో అదివారం సాయంత్రం పెదవాల్తేరు గాంధీ బొమ్మసెంటర్ వద్ద ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్పం పుస్తకాలను ఎమ్మెల్యే రామకృష్ణబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మట్టి గణపతినే పూజించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల నిమ్మజ్జనం వల్ల జల కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ రసాయన పదార్థాలు వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. సహజ సిద్ధమైన మట్టితో రూపొందించిన వినాయక విగ్రహాలను మాత్రమే వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో బైరెడ్డి రాజ్యలక్ష్మి, బీజేపీ రాజు, అనిల్, రమణ, పండా శ్రీను, మాదడా సీతాన్నరెడ్డి, వాసు, మద్దె శ్రీను, కాకి శివ, పలువురు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో..**

బీచ్ రోడ్డు, ఆగస్టు 24, (ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందిరిపై ఉందని జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం ఆర్కే బీచ్ వద్ద విశాఖ రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణహితంగా వినాయకచవితి పండుగను జరుపుకోవాలని సూచించారు. మట్టితో రూపొందించిన ప్రతిమలను మాత్రమే పూజకు వినియోగించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించడానికి గుడ్డతో తయారు చేసిన సంచులను అందించడంలో హెచ్‌పీసీఎల్ సంస్థ తీసుకున్న చొరవ స్ఫూర్తిదాయకమన్నారు. పీఆర్ఎస్ఐ విశాఖ శాఖ అధ్యక్షుడలు ఎంకేవీఎల్ నరసింహం మాట్లాడుతూ రంగులు, ప్లాస్టిక్ ఆఫ్ పారిస్‌లతో తయారు చేసే విగ్రహాలు చూడడానికి బాగున్నప్పటికీ వాటిని నిమజ్జనం చేయడం వలన నదులు, సముద్ర జలాలు ప్రమాదకర రసాయనాలతో కలుషితమవుతున్నాయన్నారు. పర్యావరణానికి హాని కలుగకుండా మట్టి ప్రతిమలను వాడడం వలన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. అనంతరం సుమారు 1200 ప్రతిమలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ కార్యదర్శి ఎ.గోవిందరావు, రోటరీ క్లబ్ ఆఫ్ విశాఖ పోర్టు సిటీ అధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి భార్గవ్‌మహర్షి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**కళా ప్రదర్శన ద్వారా ప్రచారం..**

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినాయక విగ్రహాలను వినియోగించకుండా మట్టి విగ్రహాలను మాత్రమే వినియోగించాలంటూరాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ రైతు బజార్‌కు వచ్చే వినియోగదారులు, రైతులకు మట్టి విగ్రహాలపై అవగాహన కలిగించడానికి ఆదివారం కళాకారులతో లఘు నాటికలు ప్రదర్శింపజేసింది. డప్పు, మైకు, కళాకారుల ఆటపాటా ద్వారా తగిన ప్రచారాన్ని నిర్వహిస్తోంది.

## బాలికపై అత్యాచారం

**అఘాయిత్యానికి పాల్పడిన చిన్నాన్న**

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో శని వారం రాత్రి బాలికపై అత్యాచారం జరిగింది. వరుసకు కూతురు అయ్యే పదమూడేళ్ల బాలికపై చిన్నాన్న ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిదేళ్ల క్రితం విశాఖ నగరం నుంచి ఆటో డ్రైవర్ కుటుంబం బతుకు తెరువు కోసం భీమునిపట్నం వచ్చింది. భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం వుంటున్నారు. వదిన (భార్య అక్క) కుమార్తె కూడా వీరితోపాటే ఉంటున్నది. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వదిన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం రక్తస్రావంతో బాలిక ఇబ్బంది పడుతుం డడాన్ని చిన్నమ్మ (ఆటో డ్రైవర్ భార్య) గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు ఏం జరిగిందని బాలికను అడిగారు. రాత్రి జరిగిన అఘాయిత్యం గురించి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆస్పత్రి కి వచ్చి బాలికను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు భీమునిపట్నం వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ తిరుమలరావును వివరణ కోరగా.. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవాలి

» సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు


జ్యోతి ప్రజ్వలనగావిస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, మాజీ మేయర్ హరివెంకటకుమారి తదితరులు

సిరిపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం భరత నాట్య కళాశాల స్కూలుకు చెందిన 180 మంది నృత్య కళాకారులు 20 నాట్య బృందాలు నిర్వహించిన ప్రదర్శన ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాజీ మేయర్ హరి వెంకటకుమారి, కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపాల్ గురుహరిరామ్మూర్తి, విశాఖ ఆర్ట్స్ అండ్ అసోసియేషన్ కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, చెన్నై కళాక్షేత్ర ప్రిన్సిపాల్ వసుంధరలతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు సంప్రదాయ కళలను నేర్చుకోవడం ద్వారా జీవితంలో ప్రత్యేక గుర్తింపు సాధించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. మాజీ మేయర్ హరివెంకటకుమారి మాట్లాడుతూ సంప్రదాయ కళల ద్వారా మన సంస్కృతిని చాటిచెప్పవచ్చన్నారు. తదుపరి నిర్వహించిన నృత్య కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అతిథుల చేతులమీదుగా నృత్య కళాకారులకు జ్ఞాపికలు ప్రదానం చేశారు.


నృత్య ప్రదర్శన ఇస్తున్న భరతనాట్య కళాశాల స్కూలు విద్యార్థులు

## విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటుపరం కాబోదు

**కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి శ్రీనివాసవర్మ**

తిరుపతి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాబోదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. తిరుపతిలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి వెళుతున్న కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డిని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తున్నారా అని విలేకరులు అడిగారు. ఈ సమయంలో రాజకీయాలు మాట్లాడనని కిషన్‌రెడ్డి చెప్పగా.. శ్రీనివాసవర్మ మాత్రం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకూడదదే కేంద్రప్రభుత్వం రూ.11,500 కోట్లు కేటాయించిందన్నారు. ఇది చూస్తూ కూడా ప్రైవేటుపరం చేస్తున్నారని మీరెలా అడుగుతారని ప్రశ్నించారు.

## భర్త అదృశ్యంపై ఫిర్యాదు


నాగేశ్వరరావు (ఫైల్)

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కాలనీలోని తొమ్మిదో సెక్టరు ప్రాంతంలో ఉంటున్న తన భర్త కనిపించడం లేదంటూ మహిళ ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ మురళీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

తన భర్త గుండారపు నాగేశ్వరరావు (65) కనిపించడం లేదంటూ ఆయన భార్య గుండారపు కాంతమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తాను హైదరాబాద్‌లో ఉండగా, ఈ నెల 18న తన భర్త నాగేశ్వరరావు నక్కపల్లి సమీపంలోని డొంకాడకు తన టీవీఎస్ బైకుపై వెళ్తున్నట్టు తమ పై అంతస్తులో అద్దెకుంటున్న వారికి చెప్పారని, తాను 19న ఇంటికి వచ్చి, తన భర్తకు ఫోన్ చేయగా స్విచాఫ్ అని వచ్చినట్టు పేర్కొన్నారు. పలు చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జనసేన సమావేశంలో భద్రత ఏర్పాట్లు

» పోలీసు అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన


పోలీసు అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, జనసేన నాయకులు

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జనసేన పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై మంత్రి, జనసేన పార్టీ పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పోలీసు అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. సమావేశం నిర్వహించనున్న ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో పోలీసు అధికారులతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించే పార్టీ కార్యవర్గ సమావేశానికి సుమారు 15 వేల మంది హాజరవుతారని, అందులో ఐదు వేల మంది వీరమహిళలు ఉంటారని, అందువల్ల పలు జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు వాహనాల్లో తరలిరానున్నందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీపీ, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'రక్తదానం ప్రాణదానంతో సమానం'


రక్తదానం చేస్తున్న త్రీ టౌన్ సీఐ పైడియ్య తదితరులు

పెదవాల్తేరు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రాణాలు కాపాడే రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ గొప్పవారే అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడె వెంకటపట్టాభిరామ్, త్రీ టౌన్ సీఐ పైడయ్య పేర్కొన్నారు. మదర్ థెరెసా జయంతిని పురష్కరించుకొని ఒలిశెట్టి సత్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు సహకారంతో ఆదివారం వాల్తేరు డిపో పెదజాలారిపేట రామాలయం కల్యాణ మండపంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వెంకటపట్టాభిరామ్, సీఐ పైడయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో యువతీయువకులు, స్థానికులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

» వినాయక ఉత్సవ నిర్వాహకులకు సీఐ మల్లేశ్వరరావు హెచ్చరిక

ఆరిలోవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : వినాయకచవితి ఉత్సవాల నిర్వహణ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల మండపాల నిర్వాహణకు ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసుల అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. మండపాల వద్ద గాని, నిమజ్జన సమయంలో గాని డీజే సౌండ్స్ నిషిద్ధమన్నారు. పోలీసుల ఇచ్చే సూచనలను నిర్వాహకులు పాటించాలని తెలిపారు. పందిళ్లకు 11 రోజులకు మించి అనుమతులు ఇవ్వడం జరగదన్నారు. పర్యావరణానికి హాని కలిగించే కార్యక్రమాలకు సహించబోమని తెలిపారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాలలో డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రికార్డింగ్ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయకూడదన్నారు. మండపాల్లో చిన్నపాటి సౌండ్స్ వచ్చే మైకులను మాత్రమే వాడుకోవాలని సూచించారు. మండపాలు ఏర్పాటుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. జనజీవనానికి ఇబ్బంది లేకుండా వినాయకచవితి ఉత్సవాలను జరుపుకోవాలన్నారు. ప్రతి మండపం వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

## యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెం ప్రాంతానికి చెందిన యువతి అదృశ్యం అయినట్టు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. యువతి తల్లి కోరాడ విజయలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. నగరంలోని ఓ పార్లర్‌లో మౌనిక గాయత్రి (25) ఉద్యోగం చేస్తోంది. ఈ నెల 21న ఇంటి నుంచి పార్లర్‌కు బయలు దేరిన యువతిమౌనిక గాయత్రి తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచాఫ్‌లో ఉంది. ఇంట్లో ఉండాల్సిన ఆరు తులాల బంగారం కూడా కనిపించడం లేదని మౌనిక గాయత్రి తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సీఐ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు

## జూ పార్కుకు రూ.2.98 లక్షల ఆదాయం

ఆరిలోవ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. సుమారు 3 వేల 5 వందల మంది సందర్శించినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. వీరి నుంచి రూ.2,98,740 ఆదాయం సమకూరినట్టు ఆమె వెల్లడంచారు. ప్రధానంగా సీతాకోక చిలుకల పార్కు, తెల్ల పులుల మోటుల వద్ద సందర్శకుల సందడి కనిపించింది. పలువురు సందర్శకులు ఇక్కడ సెల్ఫీలు తీసుకొంటూ కనిపించారు. సందర్శకులు అధికంగా రావడంతో జూలో కోలాహలం కనిపించింది.

## సినిమా గైడ్

- **పరదా** : శారద, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **మేఘాలు చెప్పిన ప్రేమకథ** : రమాదేవి, మోహిని (గాజువాక)
- **బన్ బట్టర్ జామ్** : రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీ కన్య హెవెన్ (గాజువాక)
- **యూనివర్సిటీ** : శ్రీకాంతి
- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం),
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె) 10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

**కోడిగుడ్లు (నెక్)**

(వంద - రూ.లలో)

| | |
|---|---|
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

**చికెన్ ధరలు**

బ్యాగ్


| | |
|---|---|
| రైతు ధర | 108 |
| లైవ్ ధర | 128 |
| విత్ స్కిన్ | 226 |
| స్కిన్‌లెస్ | 236 |

## గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో సామూహిక కుంకుమార్చనలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

వెంకోజీపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బాలభాను అర్చక, పురోహిత సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. లలితా సహస్ర పారాయణ చేస్తూ మహిళలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి బాలభాను అర్చక, పురోహిత సంఘం అన్ని సామాగ్రిని సమకూర్చింది. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు ఆరవెల్లి సూర్యప్రకాశరావు దంపతులు, అధ్యక్షులు జోష్యుల కామేశ్వరశర్మ దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘం కార్యదర్శి మావుడూరు కిషోర్ కుమార్ శర్మ సర్వేజనా సుఖినోభవంతు అంటూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రపంచంలో ప్రజలందరూ సుఖశాంతులతో కలిసిమెలిసి ఉండాలని, ఆకాంక్షిస్తూ అమ్మవారికి పూజలు చేశామన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి మహ ప్రసాదాన్ని అందజేశారు.

## విజేతలకు ఎమ్మెల్యే అభినందనలు


క్రీడాకారులతో ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా, రాష్ట్ర స్థాయిలో తైక్వాండో పోటీలో విజేతలుగా నిలిచిన బాలలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయం వద్దకు వచ్చిన విజేతలు, వారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే ప్రశంసించారు. ఆరిలోవ కాలనీకి చెందిన బాబా తైక్వాండో అకాడమీ నుంచి ఈ ఏడాది సబ్ జూనియర్స్, క్యాడెట్, జూనియర్స్ సీనియర్స్ విభాగాల్లో పలు పతకాలను సాధించారు. వారి మెడలో పతకాలను ఎమ్మెల్యే వేశారు. ధ్రువపత్రాలను అందించారు. వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కర్ణాటక, హిందూస్థానీ గాత్రకచేరి



గాత్ర కచేరి చేస్తున్న పూర్ణిక కృష్ణన్, నివేదిత భట్టాచార్య

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన కర్ణాటక, హిందీస్థానీ గాత్ర కచేరి అలరించింది. ముంబైకు చెందిన పూర్ణికకృష్ణన్ కర్ణాటక గానం, కోల్‌కతాకు చెందిన నివేదిత భట్టాచార్య హిందుస్థానీ గానం ఒకరొకరు పోటీగా అనిపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

ముందుగా 'వాతాపి గణపతింభజే..' కర్ణాటక, హిందుస్థానీలో హంసధ్వని రాగంలో ఆదితాళం ముత్తుస్వామి దీక్షితర్ కృతి పాడి మెప్పించారు. హిందుస్థానీలో యమన్ తాగం అదే కర్ణాటక సంగీతంలో కల్యాణీ శాఖీ ఏరిఅలీ పియా బిన్‌రాగ్ కృతిని ఇద్దరు స్వరకల్పన చేసి రక్తి కట్టించారు. 'రాగం తానం పల్లవి' పాటను కల్యాణి రాగం, ఆదితాళంలో చక్కని సాహిత్యంతో ఆలపించగా ఆడిటోరియం చప్పట్లతో మారుమోగింది. చివరగా 'వందేమాతరం' గీతం పాడుతూ దేశభక్తిని చాటిచెప్పారు.

కార్యక్రమంలో రియల్ అడ్మిరల్ కె.శ్రీనివాస్, కళాభారతి నిర్వాహకులు మంతెన సత్యనారాయణరాజు, రాంబాబు, పైడా కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటు



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీజీవో సమావేశం మందిరంలో ఆదివారం ఉమ్మడి విశాఖ జిల్లా ఇంటర్మీడియట్ విద్య ఉద్యోగుల సేవా సంఘం ఏర్పాటు చేశారు. ఏపీ ఎన్జీజీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, కార్యదర్శి రవిశంకర్ ఆధ్వర్యంలో ఈ సంఘానికి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా జీవీ అప్పారావు, ఉపాధ్యక్షుడుగా బి.రామారావు, కార్యదర్శి బీసీహెచ్ సుధాకర్, సహాయ కార్యదర్శి కె.జగదీశ్వరరావు, మహిళా కార్యదర్శిగా బి.సుశీల, కోశాధికారిగా ఎన్.మురళీమోహన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కేసీహెచ్ నాయుడు ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## ముగ్గురు పిల్లలను రక్షించిన లైఫ్ గార్డ్స్


పోలీసులు, లైఫ్‌గార్డ్స్‌లలో పిల్లలు

మద్దిలపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : ఆర్కే బీచ్‌లో ఆదివారం సాయంత్రం సముద్ర అలలకు కొట్టుకుపోతున్న ముగ్గురు బాలురను లైఫ్‌గార్డ్స్ సిబ్బంది రక్షించారు. వివరాలిలా ఉన్నాయి. పూర్ణామార్కెట్ కళ్లపాకలు ఏరియాకు చెందిన రియాసత్ (10), ఎర్ని కుమార్(13), వి.శశికుమార్ (13)లు ఆర్కే బీచ్‌కు వచ్చారు. బీచ్‌లో స్నానానికి దిగి ఆటాలాడారు.

అంతలో అలల ఉధృతి ఎక్కువ కావడంతో ఈ ముగ్గురు లోపలకు వెళ్లిపోయారు. ఇది గమనించిన బీచ్ లైఫ్ గార్డ్స్ వెంటనే సముద్రంలోకి దిగారు. అలల్లో కొట్టుకుపోతున్న రియాసత్, శశికుమార్, కుమార్లను సురక్షితంగా ఒడ్డుకు తీసుకొనివచ్చారు. వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి పిల్లలను అప్పగించారు. ప్రాణాలకు తెగించి ముగ్గురు పిల్లలను రక్షించిన లైఫ్‌గార్డ్స్‌ను త్రీటౌన్ సీఐ పైడయ్య అభినందించారు.

## మురళీనగర్‌లో 247 మందికి ఉచిత వైద్య పరీక్షలు

మురళీనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానికులు వినియోగించుకున్నారు. నగరంలోని ఐను నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఇన్‌స్టిట్యూట్, వాసన్ ఆసుపత్రి వైద్యుల సమన్వయంతో శిబిరం నిర్వహించారు. 247 మంది ఆరోగ్య పరీక్షలకు విచ్చేశారు. డాక్టర్ జి.రవీంద్ర, శ్రీరామ్ తదితరులు సాధారణ చికిత్సలు, కంటి వైద్య సేవల్ని అందించారు. మురళీనగర్, మాధవధార ప్రాంతాలు సహా ఎన్‌జీజీఓస్ కాలనీ, మర్రిపాలెం తదితర ప్రాంతాల నుంచి పలువురు విచ్చేసి సేవలు పొందారు.. క్లబ్ కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

### బ్రహ్మకుమారీల రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువత

బ్రహ్మకుమారీ ఆశ్రమాల దాది ప్రకాశమణి 18వ అవ్యక్త పుణ్య దివస్‌ను ఆదివారం మురళీనగర్ శాంతిధామంలో నిర్వహించారు. బ్రహ్మకుమారీల సేవా విభాగం నుంచి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సెంటర్ ఇంచార్జి బి.కె.అపరంజి పర్యవేక్షణలో ఎ.ఎస్.రాజా బ్లడ్ బ్యాంక్ సాయంతో శాంతిధామం ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వైద్యుడు యశ్వంత్, సిబ్బంది యువత నుంచి రక్తాన్ని సేకరించారు.

## స్వచ్ఛతను కాపాడుదాం




స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ఆదివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టారు. వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సూచించారు. వ్యాధులను నివారించేందుకు, ఆహ్లాదకర వాతావరణం, పరిపూర్ణ ఆరోగ్యం పొందేందుకు పరిసరాల్లో ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛాంధ్ర సమన్వయకర్త నిర్మలకుమారి మాట్లాడుతూ అపరిశుభ్రత వలన కలిగే సమస్యలను వివరిస్తూ తాగునీటి శుభ్రత, ఆహార అలవాట్లపై అవగాహన కలిగించారు.

## రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.50 వేల విలువైన 10 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కర్ణాటకకు చెందిన రసూల్ (27), షాదీక్ హుస్సేన్‌లు బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తూ దొరికారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

## ముస్లిం యువతకు ఉచితంగా వివాహాలు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ముస్లిం వెల్ఫేర్ సొసైటీ తరఫున పేద యువతీ యువకులకు ఉచితంగా వివాహం చేయనున్నట్లు అధ్యక్షుడు హైదరాలి సింకా తెలిపారు. రైల్వేన్యూకాలనీలోని ఓ హోటల్‌లో ఆదివారం పేద ముస్లిం యువతీ, యువకులకు వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి 200 మంది యువతీ, యువకులు, వారి తల్లిదండ్రులు విచ్చేశారన్నారు. వారి అర్హతల మేరకు తల్లిదండ్రులు వధూవరులను నిర్ణయించుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునీర్ ఖాన్ బాబా, షేక్ అబ్దుల్ మునీర్ పాల్గొన్నారు.

## వేలాడుతున్న చెట్ల కొమ్మలు తొలగించరూ..!

సీతంపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 25వ వార్డు సీతంపేట-శాంతిపురం రోడ్డులో గల చెట్టు కొమ్మలు విరిగి రహదారికి అడ్డంగా వేలాడుతున్నాయి. దీనివల్ల అటుగా ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చెట్టు కొమ్మలు వాలిపోయి కిందగా ఉండటంతో ఆ రహదారి మీదుగా ప్రయాణించే వారు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. వర్షకాలం సమీపించడంతో సీతంపేట, సీతమ్మధార ప్రాంతాల్లో రహదారుల పక్కన వేలాడుతున్న చెట్టు కొమ్మలను వెంటనే తొలగించాలని పలువురు కోరుతున్నారు.

# శ్రీనివాసనగర్‌లో నెల రోజులుగా అంధకారం!



శ్రీనివాసనగర్‌లో ఆదివారం రాత్రి సెల్ టార్చ్‌లతో నిరసన తెలుపుతున్న స్థానికులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డు శ్రీనివాసనగర్‌లో వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఆదివారం రాత్రి సెల్ ఫోన్ల టార్చ్ లైట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపం ప్రాంతంలో గత నెల రోజుల నుంచి వీధి లైట్లు వెలగడం లేదని చెప్పారు. ఇవి వెలగకపోవడంతో రాకపోకలకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అయినా విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

### చీకటిలో బస్ బే

అక్కయ్యపాలెం నాలుగు లేన్ల రహదారిలోని సౌత్ బస్ బే వద్ద లైట్లు వెలగకపోవడంతో చీకటి అలుముకుంది. ఆ ప్రాంతం అంధకారంలో ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో దొంగల భయం ఉందని ఆందోళన చెందుతున్నారు. కొద్ది రోజుల క్రితం అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో పట్టపగలే ఓ మహిళ మెడలో గొలుసు తెంపి పారిపోతుంటే స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు.




అక్కయ్యపాలెంలో చీకటిగా ఉన్న బస్ బే ప్రాంతం

బస్ బే దగ్గర నిలబడితే చీకటిగా ఉండడం వల్ల ఏ వాహనం ఢీకొడుతుందోనని, అలాగే దొంగలు ఎటు నుంచి వచ్చి తమను దోచుకుంటారోనని ప్రయాణికులు భయాందోళ చెందుతున్నారు. కొద్ది రోజుల నుంచి లైట్లు వెలగడం లేదని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం



వినాయక ప్రతిమల్ని అందజేస్తున్న కృష్ణారెడ్డి, వరప్రసాద్ తదితరులు

మాధవధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు సమీపంలోని రామాలయంలో ఆదివారం గణపతి మట్టి పూజా ప్రతిమల్ని ఉచితంగా అందజేశారు. ప్రముఖ వ్యాపారవేత్త, స్వాతి ప్రమోటర్స్ నిర్వాహకులు కృష్ణారెడ్డి పలువురికి ప్రతిమలను అందజేశారు. మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం' అంటూ ఆయన స్థానికులకు సూచించారు. రామాలయ కమిటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి ఎస్.వరప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కాలుష్య నివారణకు ఏటా మట్టి గణపతి విగ్రహాలను, పూజా పుస్తకాల్ని అందించడం తమ ఆలయ ఆనవాయితీగా పాటిస్తున్నట్లు కమిటీ ప్రెసిడెంట్ టి.నారాయణ రెడ్డి పేర్కొన్నారు. పర్యావరణానికి హానిచేసే పూజా హంగామాకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన కోరారు.

### కళా ప్రదర్శన



నరసింహనగర్‌లో కళాకారుల ప్రదర్శన

అక్కయ్యపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి ప్రతిమలు మాత్రమే వినాయక చవితి పూజలకు వినియోగిద్దామని సూచిస్తూ నరసింహనగర్ రైతుబజారులో ఆదివారం కళాకారులు చైతన్య ప్రదర్శన నిర్వహించారు. పాటలతో అందరినీ ఆకట్టుకున్నారు. రైతుబజారు ఎస్టేట్ అధికారి కొండబాబు మాట్లాడుతూ వినాయక విగ్రహాలకు వివిధ రకాల రంగులు వేయకుండా కేవలం మట్టితో చేసిన వాటిని మాత్రమే ఉపయోగించాలన్నారు.

## రేషన్ డిపోలకు చేరిన స్మార్ట్ కార్డులు

మాధవధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయడానికి కొత్త స్మార్ట్ కార్డులు చౌకడిపోలకు చేరాయి. సర్కిల్ 1 పౌరసరఫరాల కార్యాలయ పరిధిలోని మాధవధార, కంచరపాలెం, మురళీనగర్, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని 185 మంది డీలర్లకు ఆదివారం వీటిని అందించారు. స్మార్ట్‌కార్డులను ఏఎస్‌ఓ శ్రీహరి డీలర్లకు అందజేశారు. కొత్త కార్డులో కార్డుదారుని ఫొటో, కుటుంబ వివరాలు, చిరునామాతో కూడిన క్యూఆర్‌కోడ్ ఉన్న కొత్త కార్డుల్ని అందించారు. కొత్త కార్డులను స్వైప్ చేసే అవకాశం, క్యూఆర్‌కోడ్ స్కాన్ విధానం ఈ పాస్ యంత్రాల్లో లేనందున ఆగస్టు నెలకు పాత పద్ధతిలోనే ఈ పాస్ యంత్రాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తారు. పౌర సరఫరాల శాఖకు చెందిన కొత్త యాప్‌ను ఆశాఖ కార్యాలయంలోనే ఆదివారం ఇన్‌స్టాల్ చేసి అందించారు. తరువాత క్రమంగా కొత్త కార్డుల కోసం ఈ పాస్ యంత్రాలను సమకూరుస్తారు. కార్డుదారులకు ఎప్పుడు అందించాలన్నది సచివాలయ సిబ్బందితో అనుసంధానం చేసుకుని డీలర్లకు మార్గదర్శకాలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.



కొత్త కార్డుల్ని రేషన్ డిపోకి తీసుకెళ్తున్న ఓ డీలరు

# సుదీర్ఘ సినీ జీవితంపై కరాటే ప్రభావం: సుమన్ తల్వార్

విశాఖపట్నం స్పోర్ట్సు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కరాటే వంటి యుద్ధ విద్య (మార్షల్ ఆర్ట్స్) సాధన ద్వారా క్రమశిక్షణ, మంచి నడవడిక, ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం, సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం పెంపొందుతాయని సినీ నటుడు సుమన్ తల్వార్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో జరిగిన కరాటే సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుమారు 48 ఏళ్ల తన సినీరంగ జీవితానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో దోహదపడిందన్నారు. ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా హీరోగా సుమారు 200 చిత్రాలు సహా, ఇప్పటివరకు అన్ని భాషలలో కలిపి 800 సినిమాల్లో నటించగలగడానికి మార్షల్ ఆర్ట్స్ ద్వారా పొందిన ఆత్మవిశ్వాస ప్రభావం ఉందన్నారు. సినిమాలలో బిజీగా ఉన్నా కరాటే సంఘాల పిలుపునకు సమ్మతి తెలుపుతూ ఈ విద్యపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏటా క్రమం తప్పకుండా కరాటే సెమినార్ నిర్వహిస్తున్న చిగురుపల్లి సతీష్‌కుమార్ అభినందనీయుడని, ఇటువంటి సదస్సుల ద్వారా కరాటే క్రీడకు ప్రాచుర్యం, ప్రాధాన్యం, ఔత్సాహికులలో స్ఫూర్తి నింపుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం సెవెంత్ (7వ) డాన్ బ్లాక్ బెల్ట్ పొందిన సతీష్‌కుమార్‌కు సుమన్ తల్వార్, వరల్డ్ కరాటే ఫెడరేషన్ జడ్జి రాజేష్ అగర్వాల్ బెల్ట్, ధ్రువపత్రం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, జనసేన నాయకుడు బొడ్డేపల్లి రఘు, పేడాడ రమణకుమారి, సెమినార్ ప్రధాన నిర్వాహకుడు సిహెచ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 150 మంది కరాటే బెల్ట్ సాధకులు పాల్గొన్నారు.



సతీష్‌కు (7వ) డాన్ బ్లాక్ బెల్ట్ ప్రదానం చేస్తున్న సుమన్ తల్వార్

## విద్యార్థులకు రూ.25 లక్షల స్కాలర్ షిప్పుల పంపిణీ




విద్యార్థికి చెక్కు అందచేస్తున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు, సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

సీతమ్మధార, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని క్షత్రియ సంక్షేమ కల్యాణమండపంలో పేద, ప్రతిభావంత విద్యార్థులకు రూ.25 లక్షల స్కాలర్ షిప్పులను క్షత్రియ సంక్షేమ సంఘం ఆదివారం పంపిణీ చేసింది. సుమారు 800 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ మంతెన రామరాజు రూ.3.5 లక్షలు, మరికొందరు దాతలు తమ వంతుగా సహాయం అందజేశారు. నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, శ్రీకాకుళం జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్యలు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు స్కాలర్ షిప్ చెక్కులను అందచేశారు. క్షత్రియ సమితి చేస్తున్న ఈ కార్యక్రమాన్ని కొనియాడారు. క్షత్రియ సంక్షేమ సమితి అధ్యక్షుడు డి.తిరుపతిరాజు, కార్యదర్శి ఆర్‌వీ గణపతిరాజు, చైర్మన్ జీఎస్ఎన్ రాజు, ఎస్ఎస్ఎన్ రాజు, బి.శివాజి, వి.జానకిరామ రాజు, కెవిబిఎస్ నాగరాజు, జి.మనోహర్, సభ్యులు, డైరెక్టర్లు, యూత్‌సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## పెళ్లికి తిరస్కరించడంతో యువతి ఆత్మహత్య

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వివాహం జరిగిన వ్యక్తితో సహజీవనం చేస్తున్న ఓ యువతి, అతడు పెళ్లికి తిరస్కరించడంతో ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన కొల్లపూడి రమ్య (21), మెడ నరేష్‌లు ప్రేమించుకున్నారు. అయితే నరేష్‌కు ఇదివరకే వివాహమైంది. ఈ నెల 11న ఇద్దరు కలసి విశాఖపట్నం వచ్చి టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని కొబ్బరితోట వద్ద ఓ ఇల్లు అద్దెకు తీసుకొని సహజీవనం చేస్తున్నారు. ఇంతవరకు సరదాగా తిరిగారు. ఈ క్రమంలో రమ్య తనను వివాహం చేసుకోవాలని రెండు రోజులుగా నరేష్‌ను అడుగుతోంది. తనకు ఇప్పటికే వివాహం జరిగినందున, ఇలాగే ఉందామని నచ్చజెప్పాడు. ఒకసారి ఖమ్మం వెళ్లి వస్తానని బయలుదేరాడు. తాను ఇంక నరేష్‌ను వివాహం చేసుకోవటం కుదరదని భావించి తీవ్ర మనస్తాపానికి గురైన రమ్య శనివారం రాత్రి అద్దె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించి రమ్య కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశారు. నరేష్‌ను విచారించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## టీడీపీ పునాదులు పటిష్ఠపరచాలి

» దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ నియోజకవర్గంలో అన్ని వార్డుల్లోని ప్రతీ ఓటరు టీడీపీని బలపరిచేలా పార్టీని గట్టి పునాదులతో నిలపాలని ఎన్టీఆర్ వైద్య సేవ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడు సీతంరాజు సుధాకర్ శ్రేణులకు సూచించారు. ఆదివారం మహారాణిపేటలో బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ల నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, భవిష్యత్ ముఖ్యమంత్రి లోకేశ్ అన్న విషయం మరచిపోరాదన్నారు. జగన్ వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని, మళ్లీ ఆ పరిస్థితి తీసుకురావద్దని కోరారు. సూపర్ సిక్స్ పథకాలు సూపర్‌గా అమలు జరుగుతున్నాయని అన్నారు. ఇంటింటి సర్వేలో 29వ వార్డులో చురుగ్గా పనిచేసిన మహిళలకు సీతంరాజు సుధాకర్ నగదు పారితోషికాలు అంద జేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు, కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, పల్లా రాధ, కోడూరు అప్పల రత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్షణలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

జ్ఞానాపురం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 41వ వార్డు పరిధిలోని జ్ఞానాపురం, సెబాస్టియన్ కాలనీ, బాబుకాలనీ, జెఎన్ఎన్ఎంయూఆర్ఎం కాలనీల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోఫియా కళాశాల, జూబ్లి పాఠశాలకు అనుకుని ఉన్న ఫుట్‌పాత్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎటువంటి రక్షణ లేకపోవడంతో విద్యార్థులకు ఏప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయం, జనన మరణాల నమోదు కార్యాలయం వద్ద, చర్చి వీధిలోనూ రక్షణలేకుండానే ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### జ్ఞానాపురంలో వెలగని వీధి దీపాలు

జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో చాలా చోట్ల వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉంటోందని ఆందోళన చెందుతున్నారు. రాత్రికాగానే సమస్య మరింత జటిలమవుతోందని వారు ఆందోళన చెందుతున్నారు. 76బి/4,171బి/3 నెంబర్ల గల స్తంభాలకు వీధిదీపాలు రెండు రోజులుగా వెలగడంలేదని, వెంటనే జీవీఎంసీ విద్యుత్ అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



## జనసేన సమావేశంలో భద్రత ఏర్పాట్లు చేయండి

» పోలీసు అధికారులకు మంత్రి నాదెండ్ల మనోహర్ సూచన

మహారాణిపేట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జనసేన పార్టీ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పోలీసు అధికారులతో ఆదివారం సమావేశమయ్యారు. సమావేశం నిర్వహించనున్న ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో పోలీసు అధికారులతో మంత్రి మనోహర్ మాట్లాడుతూ ఈ నెల 30న నిర్వహించే పార్టీ కార్యవర్గ సమావేశానికి సుమారు 15 వేల మంది హాజరవుతారని, అందులో ఐదు వేల మంది వీరమహిళలు ఉంటారని, అందువల్ల పలు జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి ఇబ్బందులు లేకుండా రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు వాహనాల్లో తరలిరానున్నందున ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ సమావేశంలో డీసీపీ, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సంభాషిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, జనసేన నాయకులు

## రైల్వేస్టేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక సహాయ కేంద్రం




సహాయ కేంద్రం నమూనా

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచడంలో భాగంగా ప్రధాన రైల్వే స్టేషన్లలో ప్రత్యేక హెల్ప్ బూత్‌లు ఏర్పాటు చేసేందుకు వాల్తేరు డివిజన్ చర్యలు చేపడుతోందని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. వాల్తేరు డివిజన్ పరిధిలోని విశాఖ, శ్రీకాకుళం, రాయగడ తదితర అన్ని ప్రధాన స్టేషన్ల ప్రవేశ ద్వారం, బయటకు వెళ్లే మార్గం వద్ద సహాయ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగులకు అవసరమైన చక్రాల కుర్చీలు (వీల్ చైర్లు), క్రచెస్, ఇతర సహాయ పరికరాలు బూత్ వద్ద పొందేలా సమకూరుస్తామన్నారు. అయితే ఈ బూత్‌లలో సేవలందించేందుకు వైకల్య సంక్షేమం, సాధికారిత రంగాలకు చెందిన ప్రభుత్వేతర సంస్థలు ఉచితంగా వలంటీర్లను అందుబాటులో ఉంచేందుకు ఔత్సాహిక సంస్థలు ముందుకు రావాలని ఆహ్వానించారు. అలాంటి సేవకులకు వాల్తేరు రైల్వే ప్రాథమిక శిక్షణ ఇవ్వనుందని పేర్కొన్నారు. ఆసక్తి గల ఎన్జీవోలు, ఇతర సంస్థలు నగరంలోని డీఆర్ఎం ప్రధాన కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్‌ను కలవాలని, లేదా డబ్ల్యుఎటిఎస్‌ఆర్‌డిసిఎం @ జీ మెయిల్.కామ్‌లో సంప్రదించాలని తెలిపారు.

## 'హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షిస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్ స్వామీజీ

డాబాగార్డెన్స్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తామని రాధా మనోహర్ దాస్ స్వామీజీ అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భరతమాత ఒడిలో హిందూ ధర్మంపై ఆధారపడి జీవిస్తున్నామని, హిందూ సంప్రదాయ సంస్కృతులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం ఇచ్చి వెళ్లిపోయినప్పటికీ వారి వారసులు కొందరు ఇక్కడ ఉన్నారని, వారు భరత జాతిని చీల్చడానికి, సంపదను కొల్లగొట్టడానికి కుయుక్తులు చేస్తున్నందున, ఇప్పటికీ భారతదేశంలో ఉన్న హిందువులు అభివృద్ధి చెందలేదని వివరించారు. అన్యమత ఉద్యోగులను అధికారులను గుర్తించి తొలగించడంలో దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. న్యాయవాది జి.శ్రీకృష్ణకుమార్ మాట్లాడుతూ హిందూ న్యాయవాదులను ఏకతాటిపైకి తీసుకురావాలన్న ఉద్దేశంతో 14 మంది స్వామీజీలు సంకల్పించారని తెలిపారు. ఈ సమావేశంలో కొల్లూరి రవిశంకర్, డి.ఉమా రాజ్యలక్ష్మి, వినోద్‌కుమార్, కె.సుబ్రహ్మణ్యం, వి.సురేఖ తదితరులు పాల్గొన్నారు.

## సీడబ్ల్యూసీలకు ఆన్‌లైన్ బుకింగ్

» నిర్వహణ బాధ్యతల నుంచి ఉద్యోగ సంఘాలను తప్పించిన స్టీల్‌ప్లాంటు యాజమాన్యం

విశాఖపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ల (సీడబ్ల్యూసీ) నిర్వహణ బాధ్యతల నుంచి ఉద్యోగ సంఘాలను తప్పిస్తూ స్టీల్‌ప్లాంటు యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్లాంటులో బీఆర్ అంబేడ్కర్ కళాక్షేత్రం, ఆంధ్ర కేసరి కళాక్షేత్రం పేరుతో రెండు సీడబ్ల్యూసీలు ఉన్నాయి. వాటిని ఉద్యోగుల కుటుంబాలు శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడానికి అద్దెకు ఇస్తుంటారు. ఇప్పటివరకూ వాటిని కేటాయించే అధికారం గుర్తింపు సంఘం నాయకులకు ఉండేది. ఇప్పుడు యాజమాన్యం ఆ హక్కును తీసేసింది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఎవరికైనా కమ్యూనిటీ హాళ్లు కావాలనుకుంటే వైజాగ్ స్టీల్ డాట్ కామ్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని సర్క్యులర్ జారీచేసింది.

## జలవనరుల శాఖలో ఇన్‌చార్జుల పాలన

... 5వ పేజీ తరువాయి

ఉంటుంది. రుతుపవనాలు సీజన్ గోదావరికి వచ్చే వరదపై ఎప్పటికప్పుడు సమీక్షించి నిర్ణయాలు తీసుకోవాలి. ఇటువంటి సమయంలో వారు ఇక్కడకు వచ్చి ఉత్తరాంధ్రలోని కీలక ప్రాజెక్టుల్లో నీటి ప్రవాహాలు, నిల్వ సామర్థ్యం ఇత్యాది అంశాలను సమీక్షించి ఆదేశాలు ఇవ్వడం ఎలా సాధ్యమవుతుందని జల వనరుల శాఖ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల ఈఈలకు మూడు పాత జిల్లాల్లో ఎస్ఈ బాధ్యతలు అప్పగించి ఉంటే సబబుగా ఉండేదని వ్యాఖ్యానిస్తున్నారు. జల వనరుల శాఖలో డీఈ, సీఈల ఖాళీలను భర్తీచేయకుండా కొందరు ఉన్నతాధికారులు మోకాలడ్డుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉత్తరాంధ్రలోని లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇక్కడ ఖాళీలను భర్తీచేసేలా ఉత్తరాంధ్ర ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాల్సి ఉంది.

## జీవీఎంసీలో ఇక 10 జోన్లు

... 5వ పేజీ తరువాయి

కేటాయించకుండా నియోజకవర్గాల పేరుతో జోన్‌లు ఏర్పాటుచేస్తే ప్రజలకు కూడా స్పష్టత ఉంటుందని సూచించారు. దీంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, అదనపు, జోనల్ కమిషనర్లు నాలుగు నెలల కిందట సమావేశమై వార్డు, జోన్‌ల సరిహద్దులకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా జోన్‌లు ఏర్పాటు చేస్తే ఏవార్డులు ఎందులో చేరుతాయనే దానిపై ఒక డ్రాఫ్ట్ తయారుచేశారు. భీమిలి, పెందుర్తి నియోజకవర్గాల విస్తీర్ణం ఎక్కువగా కావడంతో ఒక వార్డు ప్రజలు జోన్ కార్యాలయానికి రావాలంటే చివరన వుండే వార్డుల నుంచి ఇబ్బంది ఎదురవుతుందని, ఈ నేపథ్యంలో ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లుగా విభజించాలని నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పరిధిలోని తూర్పు, దక్షిణ, ఉత్తర, పశ్చిమ, గాజువాక, అనకాపల్లి నియోజకవర్గాలకు ఒక్కోజోన్, భీమిలి, పెందుర్తికి రెండేసి జోన్‌లు ఏర్పాటుకానున్నాయి. దీనికి కౌన్సిల్ ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి అనుమతి రాగానే కొత్తజోన్‌ల వ్యవస్థను అమల్లోకి తేనున్నారు.

## మండపాలు నిరుపయోగం!

... 5వ పేజీ తరువాయి

సింహాచలం, వేపగుంట, పెందుర్తి, ముడసర్లోవ, తదితర ప్రాంతాల్లో అత్యాధునిక హంగులతో కల్యాణ మండపాల నిర్మాణానికి సింహాచల దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ముందుగా సింహాచలం ప్రధాన రహదారికి అనుకుని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల స్థలంలో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీదేవి కాంప్లెక్స్ పేరుతో 2019లోనే రూ.3.5 కోట్ల వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. ఇందులో దిగువ అంతస్థులో దుకాణాల సముదాయం, పైఅంతస్థులో నాలుగు కల్యాణ మండపాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

### అవగాహన లేని పనులు

అయితే సరైన అవగాహన, పక్కా ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడంతో ఇవి ఎందుకూ కొరగాకుండా మిగిలిపోయాయి. కల్యాణ మండపాల్లో సాధారణంగా పెళ్లి కుమారుడు, పెళ్లికుమార్తెకు ప్రత్యేక గదులు నిర్మించాలి. వాటితో పాటు మరుగుదొడ్లు తప్పనిసరి. అయితే శ్రీదేవి కాంప్లెక్స్‌లోని నాలుగు కల్యాణ మండపాల్లో ఇవేవీ నిర్మించలేదు. దీంతో వివాహాది కార్యక్రమాలు నిర్వహించే వారికి పనికిరాకుండా పోయాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన భవనాలు కావడంతో వాటిలో ప్రస్తుతం సుదూర ప్రాంతాల నుంచి అప్పన్న దర్శనానికి వచ్చే భక్తులకు వసతి కల్పిస్తున్నారు.

### వినియోగానికి దూరంగా...

దీంతో పాటు సత్తెమ్మతల్లి ఆలయానికి ఎదురుగా దేవస్థానానికి చెందిన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.8 కోట్లకు పైగా వ్యయంతో నాలుగు కల్యాణ మండపాల కాంప్లెక్స్ నిర్మించారు. ఈ ఏడాది చందనోత్సవానికి ముందు ఏప్రిల్ 26న ఇక్కడ మంత్రుల ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ తరువాత కల్యాణ మండపాల కాంప్లెక్స్‌ను వినియోగించిన దాఖలాలు కనిపించలేదు. దీనికి కారణాలపై ఆరా తీయగా ఆ భవనానికి విద్యుత్ సరఫరా కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాల్సి ఉందని తెలిసింది. మిగిలిన కల్యాణ మండపాల నిర్మాణాల మాటెలా ఉన్నా, ఇప్పటికే రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన వాటినైనా అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# చవితి ఉత్సవాలకు ముస్తాబైన గణనాథులు

వివిధ ఆకృతులు, సైజుల్లో తయారు చేస్తున్న కళాకారులు

ఆశాజనకంగా అమ్మకాలు సాగుతున్నాయని ఆనందం వ్యక్తం చేస్తున్న తయారీదారులు



మండపాల్లో కొలువుదీరేందుకు సిద్ధంగా ఉన్న గణనాథుని విగ్రహాలు

గాజువాక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు గణనాథులు ముస్తాబవుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలో వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా గాజువాక పరిసరాల్లో పలుచోట్ల భారీ గణనాథుల విగ్రహాలను తయారు చేస్తున్నారు. గత ఆరేడు నెలలుగా కోల్‌కతాతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కళాకారులు పలు ఆకృత్తుల్లో వివిధ సైజుల్లో విగ్రహాలను రూపొందించారు. అయితే ఈసారి విగ్రహాల తయారీకి ఖర్చు అధికం కావడంతో గణేశుని విగ్రహాల ధరలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. గతంలో కంటే ఈసారి ఐదు అడుగుల విగ్రహానికి సుమారు రూ.మూడు వేల వరకు ధర పెరిగింది. ఈ నెల 27వ తేదీనే వినాయక చవితి పండుగ కావడంతో కొంతమంది ఉత్సవ నిర్వాహకులు తయారీదారుల నుంచి విగ్రహాలను తీసుకుని తమ ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కాకుండా మట్టి విగ్రహాల తయారీకే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్టు పలువురు తయారీదారులు పేర్కొన్నారు. తాము రూపుదిద్దిన గణేశుని ప్రతిమలను గాజువాకలోని ప్రధాన రహదారులతో పాటు చిన్న చిన్న రోడ్లలో విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. ఇంట్లో పూజకు పెట్టుకునే చిన్న ప్రతిమల నుంచి వీధుల్లో ప్రతిష్ఠించేందుకు గాను సుమారు పది అడుగుల ఎత్తు గల గణనాథుని విగ్రహాలను ఆయా ప్రాంతాల్లో ఉంచి అమ్మకాలు సాగిస్తున్నారు. సోమ, మంగళవారాల్లో అమ్మకాలు విగ్రమాల అమ్మకాలు జోరందుకుంటాయని పలువురు వ్యాపారులు తెలిపారు.



గాజువాకలో విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

### గోపాలపట్నంలో..

**గోపాలపట్నం:** వినాయక చవితి ఉత్సవాలకు గడువు సమీపిస్తుండడంతో గణేశుని విగ్రహాల తయారీ, అమ్మకాలు జోరందుకున్నాయి. కోల్‌కతా నుంచి వచ్చిన పలువురు కళాకారులు ఈ ప్రాంతంలో విగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పర్యావరణానికి హాని కలగకుండా మట్టి విగ్రహాలను తయారుచేశారు. ఇవి చూపరులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. అమ్మకాలు కూడా ఆశాజనకంగా సాగుతున్నాయని తయారీదారులు తెలిపారు.



పైపు లైన్ల మరమ్మతు పనుల్లో నిమగ్నమైన సిబ్బంది

## పైపు లైన్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూర్మన్నపాలెం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో పైపు లైన్లు ఎప్పటికప్పుడు పగిలిపోయి తాగునీరు వృథాగా పోతున్నట్టు ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'వార్డుల్లో వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికతో కథనం ప్రచురితమవ్వడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఈ మేరకు తాగునీటి సరఫరా విభాగం ఏఈ కేదారినాథ్ ఆదివారం వార్డులోని పలు కాలనీల్లో తాగునీరు లీక్ అవుతున్న పైపు లైన్లకు వద్ద మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తూ సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటామని ఏఈ కేదారినాథ్ పేర్కొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాబోదు

కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

తిరుపతి (ఉపాధ్యాయనగర్), ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం కాబోదని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. తిరుపతిలో టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి వెళుతున్న కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, కిషన్‌రెడ్డిని విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తున్నారా అని విలేకరులు అడిగారు. ఈ సమయంలో రాజకీయాలు మాట్లాడనని కిషన్‌రెడ్డి చెప్పగా.. శ్రీనివాసవర్మ మాత్రం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయకూడదనే కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్లు కేటాయించిందన్నారు. ఇది చూస్తూ కూడా ప్రైవేటుపరం చేస్తున్నారని మీరెలా అడుగుతారని ప్రశ్నించారు.

### ఘనంగా సత్యమాంబ పండుగ

పెందుర్తి-రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలఅగ్రహారం పరిసర ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత సత్యమాంబ పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని నూతన వస్త్రాలు, గజమాలతో శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

### 'ఈవోఐలను రద్దు చేయాలి'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులో ఈవోఐ (ఆసక్తి వ్యక్తీకరణ)ను యాజమాన్యం రద్దు చేయాలని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలోని కీలక విభాగాలను ఈవోఐ ద్వారా ప్రైవేటీకరిచేందుకు కుట్ర జరుగుతుందన్నారు. చాలా మంది ఉద్యోగులు వీఆర్ఎస్ ద్వారా బయటకు వెళ్లిపోతున్నారని, మరోపక్క కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యం తొలగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సౌత్ ఏసీపీ శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు వ్యవహరించాలని సౌత్ ఏసీపీ వై.శ్రీనివాసరావు సూచించారు. సౌత్ పరిధిలోని వినాయక ఉత్సవ నిర్వాహకులతో గాజువాక క్లబ్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా అన్ని అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని, డీజే సౌండ్లు పూర్తిగా నిషేధమన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్సవాల్లో మందుగుండు సామగ్రిని వాడరాదని, గణనాథులను ప్రతిష్ఠించేందుకు 11 రోజులకే అనుమతి ఇస్తామని పేర్కొన్నారు. భక్తుల నుంచి టికెట్ల రూపంలో నగదు వసూళ్లకు పాల్పడరాదన్నారు. ప్రతిరోజు ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు చిన్నపాటి సౌండ్ సిస్టమ్‌ను మాత్రమే ఆయా మండపాల వద్ద వాడుకోవాలన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారులపై పందిర్లు వేయరాదని తెలిపారు. సమావేశంలో సీఐలు పార్థసారథి, మల్లేశ్వరరావు, కేశవరావు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ అఖిలపక్ష సంఘాల పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న నాయకులు, కార్మికులు



బైక్ ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

పెదగంట్యాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటులోని 42 విభాగాలను ప్రైవేటీకరించేందుకు ఉక్కు యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్లను తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాలు ఆదివారం పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించాయి. పెదగంట్యాడ కూడలి నుంచి ప్రారంభమైన పాదయాత్ర దుర్గవానిపాలెం, నెల్లిముక్కు, సిద్ధేశ్వరం, సీతానగరం, చినకోరాడ మీదుగా నడుపూరు గాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం అక్కడ జరిగిన సమావేశంలో ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంటును దశలవారీగా ప్రైవేటీకరించేందుకు కేంద్రం కుట్ర చేస్తుందని, ఇందులో భాగంగానే ప్లాంటులోని వివిధ విభాగాలకు ఈవోఐ టెండర్లను ఆహ్వానించిందన్నారు. సీఐటీయూ నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. నాయకులు యు.రామస్వామి, పిట్టా రెడ్డి, జి.గణపతిలు మాట్లాడుతూ స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టు కార్మికులను మళ్లీ పనుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పీవీ రమణమూర్తి, మసేన్‌రావు, ఎన్.తాతారావు, శ్రీమునిరి శ్రీనివాసరావు, నమ్మి రమణ, కొవిరి అవతారం, తదితరులు పాల్గొన్నారు.

### నిర్వాసిత కాలనీల్లో బైకు ర్యాలీ

**అగనంపూడి:** ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అగనంపూడి, ఉక్కు నిర్వాసిత కాలనీల్లో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయా లన్నారు. ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు అట్టా అప్పారావు, నీలకంఠరావు, మరిడయ్య, నరసింగరావు, అప్పలరాజు, పైడిరాజు, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

### 87వ వార్డులో సీఐటీయూ ర్యాలీ

**కూర్మన్నపాలెం:** ఉక్కు కర్మాగారంలో ఈవోఐలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ప్లాంట్ నాయకుల ఆధ్వర్యంలో 87వ వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యం నైపుణ్యం లేని కాంట్రాక్టు కార్మికులతో పని చేయిస్తుండడం వల్ల పాదవుతున్నాయన్నారు. వీఆర్ఎస్ ఉద్యోగుల స్థానంలో నిర్వాసితులను నియమించాలని, ఉక్కు పరిరక్షణ కోంస కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ర్యాలీ రాజీవ్ నగర్, షకీలి జంక్షన్, ముస్తఫా జంక్షన్, సిద్ధార్థ నగర్, కణితి, వడ్లపూడి మీదుగా కూర్మన్నపాలెం వరకు సాగింది. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం

వైసీపీ 'పశ్చిమ' సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తుందని, దీనిని ప్రజలందరూ గమనిస్తున్నారని.. ఎన్నికల సమయంలో తగిన బుద్ధి చెబుతారని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ పేర్కొన్నారు. వైసీపీ 61వ వార్డు అధ్యక్షుడు పిలకా రామ్మోహన్‌రెడ్డి (రాము) ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నగరాల వీధిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ హామీని కూడా కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల మహిళలకు పింఛన్ ఇస్తామని నమ్మించారని, ఇప్పుడేమో మహిళలకు ఉచిత బస్సు అంటూ మోసం చేస్తున్నారన్నారు. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైసీపీ కార్యకర్తలందరూ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోగవిల్లి నాగభూషణం, మాజీ కార్పొరేటర్ పిల్లా కనకరాజు, అనంత్ కుమార్, నూకరెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## కూతురు వరసయ్యే బాలికపై అత్యాచారం

అఘాయిత్యానికి పాల్పడిన చిన్నాన్న

భీమునిపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో శనివారం రాత్రి బాలికపై అత్యాచారం జరిగింది. వరుసకు కూతురు అయ్యే పదమూడేళ్ల బాలికపై చిన్నాన్న ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిదేళ్ల క్రితం విశాఖ నగరం నుంచి ఆటో డ్రైవర్ కుటుంబం బతుకు తెరువు కోసం భీమునిపట్నం వచ్చింది. భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివాసం వుంటున్నారు. వదిన (భార్య అక్క) కుమార్తె కూడా వీరితోపాటే ఉంటున్నది. శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వదిన కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం రక్తస్రావంతో బాలిక ఇబ్బంది పడుతుండడాన్ని చిన్నమ్మ (ఆటో డ్రైవర్ భార్య) గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. రక్తస్రావం ఆగకపోవడంతో వైద్యులు ఏం జరిగిందని బాలికను అడిగారు. రాత్రి జరిగిన అఘాయిత్యం గురించి చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆస్పత్రికి వచ్చి బాలికను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నార్త్ ఏసీపీ అప్పలరాజు భీమునిపట్నం వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సీఐ తిరుమలరావును వివరణ కోరగా.. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

### ట్రాలర్ కిందపడి యువకుడి మృతి

పెదగంట్యాడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ట్రాలర్ వెనుక పరుగెడుతూ దాని చక్రాల కింద పడి యోగేశ్ (35) అక్కడికక్కడే మృతి చెందాడు. పెదగంట్యాడ పారిశ్రామికవాడ కొంగపాలెం రోడ్డు జంక్షన్‌లో ఆదివారం ఉదయం ఈ సంఘటన జరిగింది. న్యూపోర్టు సీఐ టి.కామేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన యోగేశ్ పారిశ్రామికవాడలో కూలి పనులు చేస్తున్నాడు. గంగవరం రోడ్డు నుంచి పారిశ్రామికవాడకు వేగంగా వెళ్తున్న ట్రాలర్ వెనుక పరుగెడుతూ దాని వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజస్థాన్‌లోని కుటుంబీకులకు సమాచారం పంపారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలను పూజిద్దాం

పలుచోట్ల గణేశుని విగ్రహాల పంపిణీ

పెందుర్తి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలకు పూజించాలని యూత్ కాంగ్రెస్ పెందుర్తి నియోజకవర్గ మాజీ ఉపాధ్యక్షుడు వేగి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం ఆయన వినాయక మట్టి విగ్రహాలను తన మనుమరాలు పీల వీక్ష చేతుల మీదుగా ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా పర్యావరణ పరిరక్షణకు ఏటా మట్టి గణేశుని విగ్రహాలను పంపణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌరీ సంఘం ఉపాధ్యక్షుడు శరగడం అప్పారావు, ఆళ్ల నాగరాజు, వెంకటరావు, పి.నాయుడు, ఎం.రవి, విశ్వేశ్వరరావు, తులసీరావు, తదితరులు పాల్గొన్నారు.

**పెదగంట్యాడ:** దయాళ్‌నగర్‌లోని టిడ్కో గృహాల లబ్ధిదారులకు సీపీఐ నాయకులు మట్టి వినాయక ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలను పంపిణీ చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జి.ఆనంద్, స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ స్వాతి కృష్ణారెడ్డి సమకూర్చిన విగ్రహాలను సీపీఐ జిల్లా కమిటీ సభ్యురాలు ఎం.మణి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో లంబోదర స్త్రీశక్తి సంఘం సభ్యులు కె.రమణి, పి.లక్ష్మి, బి.ప్రమీలాకుమారి, వరలక్ష్మి, ఆలియా, తదితరులు పాల్గొన్నారు.

**ఆటోనగర్:** పర్యావరణ హితం కోసం మట్టి వినాయక ప్రతిమలకు పూజలు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జి.ఆనంద్ కోరారు. 88వ వార్డు పరిధి మంగళపాలెంలో టిడ్కో గృహ లబ్ధిదారులకు వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో పర్యావరణానికి ప్రమాదమన్నారు.

**వేపగుంట:** గ్రేటర్ 98వ వార్డు సింహపురి కాలనీలో స్థానిక నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణు సారథ్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మట్టి వినాయక్ను పూజిద్దాం-పర్యావరణాన్ని కాపాడదాం అంటూ ఐదేళ్లుగా తాము మట్టి గణేశుని ప్రతిమలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టి.చిరంజీవి, చంద్రమౌళి, సత్యనారాయణ, డీవీఎస్ రాజు, చింతారావు, జగదీశ్, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 'హైకోర్టు ఆదేశానుసారం పరిహారం చెల్లించి పనులు చేపట్టాలి'

వేపగుంట ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ జీవీఎంసీ ఉన్నతాధికారులు చేపడుతున్న ఏడీబీ పైపులైన్ పనులను నిలిపివేయాలని, పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలని నాయుడుతోట రవినగర్ నివాసితుడు గారపాటి శరత్‌చందర్ డిమాండ్ చేశారు. నాయుడుతోట రవినగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేపగుంటలోని సర్వే నంబర్ 77/10ఏలో నాయుడుతోట నుంచి పొర్లుపాలెం వెళ్లే రహదారిలో 2018లో ఏడీబీ నిధులతో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ తాము ఏపీ హైకోర్టులో కేసు వేయగా 2023 మే 5న తీర్పు వచ్చిందన్నారు. ఈ కేసులో రెండో ప్రతివాది జిల్లా కలెక్టర్, ఆరో ప్రతివాది జీవీఎంసీ కమిషనర్‌లకు బాధితులకు నింబంధనలకు అనుకూలంగా పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో 2018 నుంచి 2025 ఆగస్టు 8 వరకు పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. కాగా నూతన కమిషనర్ మౌఖిక ఆదేశాలతో రెండు వారాలుగా పనులు సాగిస్తున్నారని, దీనిపై కమిషనర్, కలెక్టర్‌లకు పోస్టు ద్వారా సమాచారం అందించినా ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కమిషనర్ కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని తమకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు.

### జనసైనికుల సమావేశాన్ని విజయవంతం చేయాలి

అగనంపూడి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మునిసిపల్ స్టేడియంలో ఈ నెల 30న జరిగే రాష్ట్ర స్థాయి జనసైనికుల సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హాజరవుతున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ 79వ వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్ కోరారు. ఇక్కడి కొండయ్యవలసలోని సీడబ్ల్యూసీలో ఆదివారం జనసైనికుల వార్డు స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30న జరిగే సమావేశంలో అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొనవలసిందిగా పిలుపునిచ్చారు. నాయకులు వసంత్, బుదిరెడ్డి అప్పారావు, బలిరెడ్డి కుమార్, శ్రీనివాస్, గొల్లవిల్లి పైడిరాజు, అయితి అప్పలరాజు, పైడిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

## సినిమా గైడ్

- **వార్-2** : జగదాంబ, రమాదేవి, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శ్రీకన్య, శరత్, కామేశ్వరి, లక్ష్మీనరసింహ-1, 2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నరసింహ (గోపాలపట్నం), కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : సంగం, వెంకటేశ్వర-1, లీలామహల్, కిన్నెర, శారద, శ్రీరామా, గోకుల్, సౌజన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), లిఖిత (శ్రీహరిపురం).
- **సార్, మేడమ్** : మౌర్య (గోపాలపట్నం),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మోహిని (గాజువాక).

## రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 24, టమాటా 50, వంకాయలు (తెలుపు) 32, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 40, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 30, బీరకాయలు 48, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజీ 20, క్యారెట్ 46, దొండకాయలు 32, బంగాళ దుంపలు 18, అరటి కాయ (పె)10, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 74, బరబాటి 36, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 32, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 46, కంద 40, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

| కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో) | |
|---|---|
| విశాఖపట్నం | 520 |
| విజయనగరం | 524 |
| శ్రీకాకుళం | 524 |

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | |
| రైతు ధర | 103 |
| లైవ్ ధర | 123 |
| విత్ స్కిన్ | 216 |
| స్కిన్‌లెస్ | 226 |